# లోకల్ గైడ్

జాతీయ దినపత్రిక

LOCAL NEWS GOBAL FOCUS

LGTV

తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్



లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జిలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.

ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094



ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 14, | సంచిక ,199 | పేజీలు -12 | సోమవారం -17- మే - 2026 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,




2లో

## ఈసారి ముందే రుతుపవనాలు.. కానీ 'ఎల్ నినో' గండం!

- కేరళలోకి ఈ నెల 26నే ప్రవేశించనున్న నైరుతి రుతుపవనాలు
- ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతంపై ఆందోళన
- సాధారణం కన్నా తక్కువ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ
- వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం
- గతంలోనూ ఎల్ నినోతో పంట నష్టం, నీటి కొరత

# అమరావతిలో క్వాంటం -సెక్యూర్ టెస్ట్ బెడ్..

ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ వేదికగా పరిశోధనలు

-సైబర్ రక్షణ పరిష్కారాలకు కేంద్రంగా అమరావతి

- మేకిన్ ఇండియా సాంకేతికతలకు ఈ ప్రాజెక్టుతో ఊతం



అమరావతి: దేశంలోనే తొలి క్వాంటం-సెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్ అమరావతిలో ఏర్పాటు కానుంది. ఈ సరికొత్త ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సొసైటీ దినోత్సవం సందర్భంగా ఆయన 'ఎక్స్' వేదికగా ఈ విషయాలు వెల్లడించారు. భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖకు చెందిన మిగతా.. 2లో

## ప్యాంటు జేబుల్లో రూ.5.5 కోట్ల విలువైన బంగారం దాచిన భారత సంతతి వ్యక్తి అరెస్టు



2లో

- ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు
- ప్రత్యేకంగా రూపొందించిన తన ప్యాంటులో బంగారం బిస్కెట్లను పెట్టుకొచ్చిన నిందితుడు
- శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ఢిల్లీకి వచ్చిన విమానం



### నరసరావుపేట డీఎస్పీకి తన పాస్‌పోర్ట్

## అప్పగించిన విడదల రజని

- డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి పాస్‌పోర్ట్ అప్పగించిన విడదల రజని
- అట్రాసిటీ కేసులో హైకోర్టు షరతులతో కూడిన ఆదేశం
- విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఇప్పటికే ఏసీబీ కేసుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి

అమరావతి: మాజీ మంత్రి, వైసీపీ నేత విడదల రజని మిగతా.. 2లో

# యుద్ధాన్ని సాకుగా చూపి సామాన్యుల నడ్డి విరచడమే

### మోదీ అనాలోచిత విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలు

- పెట్రో ధరల పెంపు ఏ మాత్రం సమర్థనీయం కాదు
- ఎన్నికలకు ముందు ధరలు పెంచం అని పదే పదే ప్రకటించారు
- ఫలితాలు వచ్చాక లీటరుకు రూ.3 పెంచడం ప్రజల్ని వంచించడమే



హైదరాబాద్: నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్రం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని ఆయన శనివారం ఎక్స్‌లో తెలిపారు. ధరల పెంపు నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని, మిగతా.. 2లో



2లో

## జీవితంలోనే అత్యంత కష్టకాలం... తీవ్రమైన మానసిక క్షోభను ఎదుర్కొన్నాం: బండి సంజయ్

- అదే సమయంలో తన తల్లి గుండెపోటుకు గురయ్యారని... అది తమకు తీవ్రమైన మానసిక క్షోభను కలిగించింది
- "గడిచిన వారం రోజులుగా మా కుటుంబం మా జీవితంలోనే అత్యంత భావోద్వేగభరితమైన కష్టకాలం



## ఇందిరమ్మ ఇళ్లు... కేంద్రం వాటా కోసం ఎదురు చూస్తున్నాం: మంత్రి పొంగులేటి

- కేంద్రం నుంచి ఒక్కో ఇంటికి సుమారు ఒక లక్షా 13 వేల రూపాయిల వాటా విడుదల కావాల్సి ఉంది
- కేంద్రం నుంచి నిధుల వస్తాయన్న నమ్మకంతో ఇందిరమ్మ లబ్దిదారులకు ఫైనల్ బిల్లులు ఆపడం జరిగింది
- ఒక్కో ఇందిరమ్మ ఇంటికి 1.60 లక్షల రూపాయిలను తాత్కాలికంగా ఆపాం
- 15-20 రోజుల్లోగా విడుదల చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే భరించి లబ్దిదారులకు నిధులు అందజేస్తుంది మిగతా.. 2లో

## త్వరలోనే మేడిన్ ఇండియా సీ-295 విమానం... పైలట్ ను కాపాడేందుకు అమెరికా ఉపయోగించిన విమానం ఇదే!




2లో

- భారత్‌లో ప్రైవేటు రంగంలో తయారైన తొలి సైనిక విమానం సీ-295
- వడోదరలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ నిర్మాణం
- హెచ్ఏఎల్ గుత్తాధిపత్యానికి తెరదించుతూ ప్రైవేటు రంగం ముందడుగు
- పాత అవ్రో-748 విమానాల స్థానంలోకి రానున్న సీ-295 విమానాలు

# 11వ శతాబ్ది నాటి చోళుల రాగి ఫలకాలు భారత్‌కు రాక

### 'ఇది ప్రతి భారతీయుడికి ఆనంద క్షణం":మోదీ

- భారత్‌కు తిరిగి వస్తున్న చోళుల కాలం నాటి రాగి ఫలకాలు..'
- నెదర్లాండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ
- రాజరాజ చోళుడు, రాజేంద్ర చోళుడి కాలం నాటివిగా గుర్తింపు
- ఇది ప్రతి భారతీయుడికి ఆనంద క్షణమన్న ప్రధాని మోదీ
- 1862 నుంచి లైడెన్ యూనివర్సిటీ వద్ద ఉన్న ఫలకాలు



ఢిల్లీ: భారత చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. 11వ శతాబ్దానికి చెందిన చోళుల కాలం నాటి అమూల్యమైన రాగి ఫలకాలు నెదర్లాండ్స్ నుంచి తిరిగి స్వదేశానికి రానున్నాయి. మిగతా.. 2లో

### మిస్టర్ మోదీ... దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు

# అడుగుతోంది... బదులివ్వండి

### దేశం అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్

- నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని మోదీని టార్గెట్ చేసిన రాహుల్ గాంధీ
- 2024, 2026 సంవత్సరాలను పోలుస్తూ ప్రభుత్వ వైఖరిపై వ్యంగ్యాస్త్రాలు
- పదేపదే విఫలమవుతున్న విద్యామంత్రిని ఎందుకు తొలగించడం లేదని ప్రశ్న
- 'పరీక్షా పే చర్చ'పై ప్రధాని మోదీ మౌనాన్ని ప్రశ్నించిన ప్రతిపక్ష నేత



అమరావతి: నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024, 2026 సంవత్సరాల పరిస్థితులను పోలుస్తూ ప్రభుత్వ వైఖరిపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పదేపదే పేపర్ లీక్‌లు జరుగుతున్నా ప్రభుత్వం కఠిన చర్యలు మిగతా.. 2లో

## ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ కీలక కమాండర్ హదాద్ మృతి

### హదాద్ మృతి చెందినట్లు ధృవీకరించిన హమాస్



2లో


- 2023లో జరిగిన దాడులకు సంబంధించి సూత్రధారుల్లో ఒకరిగా ఇజ్రాయెల్ వెల్లడి
- దాడుల్లో భార్య, కుమార్తె మృతి

## వడగాల్పులకు 3,000 కోళ్లు బలి.. పిడుగుపాటుకు యువకుడు, 30 గొర్రెల మృతి

## తెలంగాణలో 44.5 డిగ్రీలకు చేరిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

- వడదెబ్బకు వనపర్తి జిల్లాలో వేల కోళ్లు మృత్యువాత
- రానున్న మూడు రోజులు ఎండలు మరింత పెరిగే అవకాశం
- అండమాన్‌లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు

హైదరాబాద్: తెలంగాణలో విపరీత వాతావరణ పరిస్థితులు ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. ఒకవైపు భానుడి ప్రతాపంతో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండగా, మరోవైపు అకాల వర్షాలు, పిడుగులతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఎండల తీవ్రతకు వేలాది కోళ్లు ప్రాణాలు కోల్పోగా, పిడుగు పాటుకు ఓ యువకుడు, మూగజీవాలు మిగతా.. 2లో



లోకల్ గైడ్
జాతీయ దినపత్రిక
LOCAL NEWS GOBAL FOCUS
తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్



## ప్యాంటు జేబుల్లో రూ.5.5 కోట్ల విలువైన బంగారం దాచిన భారత సంతతి వ్యక్తి అరెస్టు

ఢిల్లీ: ప్యాంటు జేబుల్లో రూ. 5.5 కోట్ల విలువైన 115 బంగారు బిస్కెట్లను దాచి అక్రమ రవాణాకు పాల్పడిన భారత సంతతి వ్యక్తిని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ (ఐజీఐ) విమానాశ్రయంలో అధికారులు అరెస్టు చేశారు. ఈ బంగారాన్ని నిందితుడు ప్రత్యేకంగా రూపొందించిన తన ప్యాంటు ప్యాకెట్లలో పెట్టుకుని తీసుకురావడం గమనార్హం. నిందితుడు అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ఎయిరిండియా విమానంలో ఢిల్లీకి వచ్చాడు. విమానాశ్రయంలో దిగి గ్రీన్ ఛానల్ మార్గంలో వెళ్ళేందుకు ప్రయత్నించగా, కస్టమ్స్‌కు చెందిన ఎయిర్ ఇంటెలిజెన్స్ విభాగాధికారులు అనుమానించి అడ్డుకున్నారు. అతనిని పూర్తిగా తనిఖీ చేయగా ట్రౌజర్‌లో ప్రత్యేకంగా రూపొందించిన ప్యాకెట్లలో బంగారు బిస్కెట్లు బయటపడ్డాయి. వాటిని అధికారులు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## త్వరలోనే మేడిన్ ఇండియా సీ-295 విమానం... పైలట్ ను కాపాడేందుకు అమెరికా ఉపయోగించిన విమానం ఇదే!

ఢిల్లీ: భారత రక్షణ తయారీ రంగంలో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశంలో తొలిసారిగా ప్రైవేటు రంగంలో తయారైన సీ-295 సైనిక రవాణా విమానం త్వరలోనే గగనవిహారం చేసేందుకు సిద్ధమవుతోంది. గుజరాత్‌లోని వడోదరలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) దీన్ని నిర్మించింది. దశాబ్దాలుగా ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ఆధిపత్యంలో ఉన్న ఈ రంగంలోకి టాటా రాకతో కీలక మార్పు రాబోతోంది. ఇటీవల ఈ విమానాన్ని హ్యాంగర్ నుంచి బయటకు తీసుకువస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో కనిపించినా అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. అయితే, గత గురువారం నాడు వైమానిక దళ డిప్యూటీ చీఫ్ ఎయిర్ మార్షల్ ఏ.కే. భారతి వడోదరలోని టాటా అసెంబ్లీ లైన్‌ను సందర్శించడంతో, తొలి విమాన ప్రయోగానికి సన్నాహాలు జరుగుతున్నట్లు స్పష్టమైంది. వాస్తవానికి సెప్టెంబర్ నాటికి ఇది సిద్ధమవుతుందని భావించినా, షెడ్యూల్ కంటే ముందుగానే పనులు పూర్తి కావడం విశేషం. 2021లో కుదిరిన రూ.21,935 కోట్ల ఒప్పందం ప్రకారం, వాయుసేన కోసం మొత్తం 56 విమానాలను కొనుగోలు చేస్తున్నారు. వీటిలో 16 స్పెయిన్ నుంచి రాగా, మిగిలిన 40 విమానాలను టాటా సంస్థ భారత్‌లోనే తయారు చేస్తోంది. పాతబడిన అవ్రో-748 విమానాల స్థానంలోకి ఇవి రానున్నాయి. ఈ విమానం 9.5 టన్నుల బరువును లేదా 70 మంది సైనికులను మోసుకెళ్లగలదు. ముఖ్యంగా, ఎత్తైన, కఠినమైన ప్రదేశాల్లో ఎలాంటి రన్‌వే లేనిచోట కూడా కేవలం 320 మీటర్ల చిన్న స్థలంలో టేకాఫ్, ల్యాండింగ్ చేయగలదు. ఈ ప్రాజెక్టు ద్వారా రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ దిశగా కీలక ముందడుగు పడినట్లయింది. ఈ ఫ్యాక్టరీ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు రానున్నాయి. భవిష్యత్తులో ఈ విమానాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇటీవల ఇరాన్ తో యుద్ధంలో శత్రు భూభాగంలో చిక్కుకున్న తన పైలెట్ ను కాపాడేందుకు అమెరికా ఉపయోగించింది కూడా ఈ సీ-295 విమానమే.

## ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ కీలక కమాండర్ హదాద్ మృతి

ఢిల్లీ: ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో గాజాలోని హమాస్ సాయుధ విభాగాధిపతి ఇజ్ అల్ హదాద్ మృతి చెందాడు. అతను మృతి చెందినట్లు హమాస్ కూడా ధృవీకరించింది. తాము చేసిన దాడుల్లో హమాస్ కీలక నేత మృతి చెందినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇజ్ అల్ హదాద్ 2023 అక్టోబర్ 7వ తేదీన జరిపిన దాడులకు సూత్రధారుల్లో ఒకరిగా పేర్కొంది. ఈ దాడుల్లో అతడి భార్య, కుమార్తె కూడా ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. హమాస్ కీలక నేత మొహమ్మద్ సిన్వర్ మృతి తర్వాత ఆయన బాధ్యతలను హదాద్ తీసుకున్నాడు. ఇజ్రాయెల్ రక్షణ దళాలపై దాడులకు వ్యూహరచన చేయడంలో హదాద్ కీలకంగా వ్యవహరించాడు. యుద్ధం సమయంలో ఇజ్రాయెల్ సైనికులను పట్టుకోవడంతో పాటు, వారిని తనకు రక్షణ కవచంగా ఉపయోగించుకున్నాడు. హమాస్ స్థావరాల పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించాడు.

## జీవితంలోనే అత్యంత కష్టకాలం... తీవ్రమైన మానసిక క్షోభను ఎదుర్కొన్నాం: బండి సంజయ్

హైదరాబాద్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎక్స్ వేదికగా గత కొద్ది రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలపై ఎమోషనల్ పోస్టు చేశారు. గడిచిన వారం రోజులు తమ జీవితంలోనే అత్యంత కష్టకాలం అని తెలిపారు. అదే సమయంలో తన తల్లి గుండెపోటుకు గురయ్యారని... అది తమకు తీవ్రమైన మానసిక క్షోభను కలిగించిందని చెప్పారు. అయితే ఈ కష్టకాలంలో దేశవ్యాప్తంగా లక్షలాది మంది చూపిన ప్రేమ, మద్దతు తనకు దృఢంగా నిలబడే శక్తిని ఇచ్చాయని చెప్పారు. అదే సమయంలో తన కొడుకు భగీరథ్ అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించిన బండి సంజయ్... వ్యక్తిగత కుటుంబ విషయం అని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని అభ్యర్థించారు. ఇందుకు సంబంధించి న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. "గడిచిన వారం రోజులుగా మా కుటుంబం మా జీవితంలోనే అత్యంత భావోద్వేగభరితమైన కష్టకాలాన్ని ఎదుర్కొంది. బాధ, ఆందోళన, నిస్సహాయత, తీవ్రమైన మానసిక ఒత్తిడితో కూడిన క్షణాలు ఎదురయ్యాయి. ఈ పరిస్థితి మా కుటుంబం మొత్తాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఈ కష్టకాలంలో మా అమ్మ గుండెపోటుకు గురయ్యారు... అది మాకు చాలా తీవ్రమైన మానసిక క్షోభను కలిగించింది. కానీ ఈ కష్ట సమయంలో దేశవ్యాప్తంగా లక్షలాది మంది చూపిన అపారమైన ప్రేమ, మద్దతు నాకు దృఢంగా నిలబడే శక్తిని ఇచ్చాయి. మాకు అండగా నిలిచి, మా కోసం మాట్లాడి, మా కోసం ప్రార్థించి, మానసికంగా మద్దతు ఇచ్చిన ప్రతి బీజేపీ కార్యకర్తకు, నాయకుడికి, మద్దతుదారుడికి, స్నేహితుడికి, మీడియా, సోషల్ మీడియా సభ్యులకు నేను హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. మారుమూల గ్రామాల నుంచి నగరాల వరకు, యువకుల నుండి వృద్ధుల వరకు, లెక్కలేనంత మంది ప్రజలు మా గురించి ఆందోళన చెందారు. ఆప్యాయతతో మాకు మద్దతుగా నిలిచారు.

## ఈసారి ముందే రుతుపవనాలు.. కానీ 'ఎల్ నినో' గండం!

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే దేశంలోకి ప్రవేశించనున్నాయి. సాధారణంగా జూన్ 1న కేరళను తాకే రుతుపవనాలు, ఈసారి మే 26నే తీరాన్ని పలకరించనున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఇటీవల ప్రకటించింది. మే 28 నాటికి పశ్చిమ తీరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అయితే, ఈ సానుకూల వార్తతో పాటే ఓ ఆందోళనకరమైన అంశం కూడా ఉంది. ఎల్ నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ శాఖ తన తొలి దశ అంచనాలో, జూన్-సెప్టెంబర్ మధ్య వర్షపాతం 92 శాతం మాత్రమే నమోదై, సాధారణం కంటే తక్కువగా ఉంటుందని పేర్కొంది. రుతుపవనాలు ముందుగా రావడం, మొత్తం వర్షపాతానికి ప్రత్యక్ష సంబంధం ఉండదని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రుతుపవనాల సమయంలో ఏర్పడే అల్పపీడనాలపైనే వర్షపాతం ఆధారపడి ఉంటుందని ప్రైవేటు వాతావరణ సంస్థ 'స్కైమెట్ వెదర్' వైస్ ప్రెసిడెంట్ మహేష్ పాలవత్ వివరించారు. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్నే ఎల్ నినో అంటారు. దీనివల్ల భారత ఉపఖండం వైపుగా వచ్చే తేమ గాలులు తగ్గిపోయి, వర్షపాతం తగ్గుతుంది. ఈ ఏడాది మే-జూలై మధ్య ఎల్ నినో ఏర్పడేందుకు 82 శాతం అవకాశాలు ఉన్నాయని అంచనా. గతంలో 2015-16లో తీవ్రమైన ఎల్ నినో కారణంగా దేశంలో వర్షపాతం 86 శాతం మాత్రమే నమోదైంది. ముఖ్యంగా మహారాష్ట్రలోని మరాఠ్వాడాలో 40 శాతం లోటుతో తీవ్ర నీటి కొరత, పంట నష్టం సంభవించింది. మొత్తం మీద, రుతుపవనాలు ముందుగా రావడం రైతులకు కొంత ఊరటనిచ్చే అంశమే అయినా, ఎల్ నినో ముప్పు నేపథ్యంలో వ్యవసాయం, నీటి నిల్వలు, దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నరసరావుపేట డీఎస్పీకి తన పాస్‌పోర్ట్ అప్పగించిన విడదల రజని

అమరావతి: మాజీ మంత్రి, వైసీపీ నేత విడదల రజిని తన పాస్‌పోర్ట్‌ను నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో అప్పగించారు. తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టు విధించిన షరతుల మేరకు ఆమె ఈ చర్య తీసుకున్నారు. ఆదివారం నాడు ఆమె డీఎస్పీ కార్యాలయానికి వచ్చి పాస్‌పోర్ట్‌ను పోలీసులకు అందజేశారు. వివరాల్లోకి వెళితే, చిలకలూరిపేటకు చెందిన టీడీపీ నేత పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యడ్లపాడు పోలీసులు విడదల రజిని, ఆమె అనుచరులపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు రజిని హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం, ఆమె విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్ట్‌ను తక్షణం పోలీసులకు అప్పగించాలని షరతులతో కూడిన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను పాటిస్తూ, విడదల రజిని తన న్యాయవాదులతో కలిసి నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావును కలిశారు. పాస్‌పోర్ట్‌ను ఆయనకు అందజేసి, సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత విడదల రజిని వరుస కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని బెదిరించి రూ. 2.20 కోట్లు వసూలు చేశారన్న ఆరోపణలపై ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఆమె మరిది విడదల గోపిని అధికారులు అరెస్టు కూడా చేశారు.

## బండి భగీరథ్ అరెస్ట్.. కేంద్రానికి సంబంధం లేదు: కిషన్ రెడ్డి

హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్ట్ కావడంపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి స్పందించారు. భగీరథ్ ఇప్పటికే సరెండర్ అయ్యాడని గుర్తుచేశారు. ఇక దానిపై చర్చించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఈ కేసుతో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. పూర్తిగా రాష్ట్ర పోలీసులే ఈ వ్యవహారాన్ని చూసుకుంటారని వివరించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు.

ప్రతిపైసా కేంద్రానిదే

మరోవైపు ధాన్యం సేకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లకు ప్రతిపైసా కేంద్రమే ఇస్తోందని వెల్లడించారు. అయినా రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా సన్న వడ్లకు రాష్ట్రం బోనస్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యంపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారని.. వారికి రాష్ట్ర ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. మంత్రులు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో కొనుగోళ్లను పర్యవేక్షించాలని సూచించారు.

## యుద్ధాన్ని సాకుగా చూపి సామాన్యుల నడ్డి విరచడమే

మొదటి పేజి తరువాయి

నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని సీఎం స్పష్టం చేశారు. ఆత్మనిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప ఫలితాలు తెచ్చిన పాలసీ కాదని తేలిపోయిందని ఆయన పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని, యువత ఉపాధికి గ్యారంటీ లేని పరిస్థితి దాపురించిందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలిందని విమర్శించారు. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తూ ఇప్పుడు పరాకాష్ఠకు చేరిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ - ఇజ్రాయెల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమేనని ఆయన వివరించారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం ధరల పెంపు నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుందని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం అని పదే పదే ప్రకటించి ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే లీటరుకు రూ.3 చొప్పున పెంచడం ప్రజల్ని వంచించడమేనని విమర్శించారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోదీ అబద్ధాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారని.. ఇది విశ్వాస ఘాతుకం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ ఇళ్లు... కేంద్రం వాటా కోసం ఎదురు చూస్తున్నాం: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకంకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ వాటాగా రావాల్సిన నిధుల కోసం ఈ ఏడాది మార్చి నుంచి ఎదురుచూస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కేంద్రం నుంచి ఒక్కో ఇంటికి సుమారు ఒక లక్షా 13 వేల రూపాయిల వాటా విడుదల కావాల్సి ఉందని చెప్పారు. కేంద్రం నుంచి నిధుల వస్తాయన్న నమ్మకంతో ఇందిరమ్మ లబ్దిదారులకు ఫైనల్ బిల్లులు ఆపడం జరిగిందని అన్నారు. అయితే ఆ నిధుల కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతానికి ఒక ఇల్లు కూడా మంజూరు కాలేదని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం రోజున మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నుంచి రావాల్సిన వాటా కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధుల కోసం పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు తాను కూడా కేంద్రాని అభ్యర్థన చేశానని చెప్పారు. ఆ నిధుల విడుదల కోసం ప్రయత్నిస్తున్నామని... ఈ క్రమంలోనే ప్రస్తుతం పూర్తయిన ఒక్కో ఇందిరమ్మ ఇంటికి 1.60 లక్షల రూపాయిలను తాత్కాలికంగా ఆపామని తెలిపారు. ఒకవేళ కేంద్రం మరో 15-20 రోజుల్లోగా విడుదల చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే భరించి లబ్దిదారులకు నిధులు అందజేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తొలివిడత మూడున్నర లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా ఇంతవరకు సుమారు 1.32 లక్షల ఇండ్లు పూర్తయ్యాయని మంత్రి పొంగులేటి తెలిపారు. జూన్ నెలాఖరుకల్లా 68 నుంచి 72 వేల ఇండ్లు శ్లాబ్‌ల నిర్మాణం పూర్తవుతుందన్నారు.

## అమరావతిలో క్వాంటం -సెక్యూర్ టెస్ట్ బెడ్..

మొదటి పేజి తరువాయి

సి-డాట్, అమరావతి క్వాంటం వ్యాలీ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. అమరావతిలోని ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో ఈ టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. నెక్స్ట్ జనరేషన్ సైబర్ డిఫెన్స్ సొల్యూషన్లకు అమరావతి ఇకపై కేంద్ర బిందువుగా మారుతుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. సురక్షితమైన సమాచార మార్పిడి, నమ్మకమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు దేశ భవిష్యత్తుకు ఎంతో కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. గత ఏప్రిల్ 14న క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ ప్రారంభమైనప్పటి నుంచి ఏపీలో కీలక అడుగులు పడుతున్నాయి. టెలికమ్యూనికేషన్, ఐటీ, క్వాంటం రంగాల్లో అమరావతి వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ కొత్త టెస్ట్ బెడ్ క్వాంటం కమ్యూనికేషన్ హార్డ్‌వేర్, ఆప్టికల్ సిస్టమ్స్, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీల పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడనుంది. దీనివల్ల మేక్ ఇన్ ఇండియా టెక్నాలజీలకు ఊతం లభించడంతో పాటు అమరావతికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు దక్కుతుంది. డీప్-టెక్ ఆవిష్కరణలకు ఏపీ రాజధాని కీలక కేంద్రంగా మారబోతోంది. ప్రపంచ భవిష్యత్తును మార్చే సాంకేతికతలను రూపొందించడంలో ఏపీ విద్యార్థులు, స్టార్టప్‌లు భాగస్వాములు కావడానికి ఇది మంచి అవకాశమని చంద్రబాబు అన్నారు. ఈ అద్భుతమైన ప్రాజెక్టు కోసం శ్రమిస్తున్న సంస్థలకు అభినందనలు తెలిపారు. ఇందులో భాగస్వాములైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, యువ ఆవిష్కర్తలకు ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## 11వ శతాబ్ది నాటి చోళుల రాగి ఫలకాలు భారత్‌కు రాక

మొదటి పేజి తరువాయి

నెదర్లాండ్స్‌లోని ది హేగ్‌లో నిన్న జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ఫలకాలను భారత్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ, డచ్ ప్రధాని రాబ్ జెట్టెన్ హాజరయ్యారు. ఈ రాగి ఫలకాల సెట్‌లో 21 పెద్దవి, 3 చిన్న ఫలకాలు ఉన్నాయి. వీటిపై సంస్కృతం, తమిళ భాషల్లో శాసనాలు ఉన్నాయి. తన తండ్రి రాజరాజ చోళుడు ఇచ్చిన వాగ్దానాన్ని కుమారుడైన రాజేంద్ర చోళుడు అధికారికంగా నెరవేర్చిన చారిత్రక ఘట్టాన్ని ఇవి వివరిస్తాయి. నాగపట్నంలోని బౌద్ధ విహారానికి అనైమంగళం గ్రామ ఆదాయాన్ని కేటాయించినట్లు ఈ ఫలకాలలో పొందుపరిచారు. చోళుల వైభవాన్ని, పరిపాలనా దక్షతను ఈ శాసనాలు తెలియజేస్తాయి. దాదాపు 1862 నుంచి ఈ ఫలకాలు నెదర్లాండ్స్‌లోని లైడెన్ యూనివర్సిటీ ఆధీనంలో ఉన్నాయి. వలస పాలన కాలంలో వీటిని అక్రమంగా తరలించారని నిర్ధారించిన డచ్ కమిటీ సిఫారసుల మేరకు, భారత ప్రభుత్వం చేసిన అభ్యర్థనతో వీటిని తిరిగి అప్పగించడానికి నెదర్లాండ్స్ ప్రభుత్వం అంగీకరించింది. ఈ పరిణామంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. "ఇది ప్రతి భారతీయుడికి ఆనంద క్షణం" అని పేర్కొన్నారు. చోళుల గొప్పతనాన్ని, వారి సంస్కృతిని, సముద్ర వాణిజ్య నైపుణ్యాన్ని భారత్ ఎంతో గర్వంగా స్మరించుకుంటుందని తెలిపారు. ఈ ఫలకాలను ఇన్నాళ్లు భద్రపరిచిన లైడెన్ యూనివర్సిటీకి, నెదర్లాండ్స్ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ఈ ఫలకాలను అధికారికంగా భారత్‌కు తరలించనున్నారు.

## మిస్టర్ మోదీ... దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది... బదులివ్వండి

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందని ఆరోపించారు.

ఈ సందర్భంగా రాహుల్ తన వ్యాఖ్యలలో...

నీట్ 2024: పేపర్ లీక్ అయింది. పరీక్ష రద్దు కాలేదు. మంత్రి రాజీనామా చేయలేదు. సీబీఐ విచారణ, ఒక కమిటీ ఏర్పాటయ్యాయి.

నీట్ 2026: పేపర్ లీక్ అయింది. పరీక్ష రద్దు అయింది. కానీ మంత్రి మాత్రం ఇప్పటిదాకా రాజీనామా చేయలేదు. మళ్లీ సీబీఐ విచారణ, మరో కమిటీ ఏర్పాటవుతుంది" అంటూ ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీకి దేశం తరఫున కొన్ని ప్రశ్నలు సంధిస్తున్నానని రాహుల్ పేర్కొన్నారు. "మిస్టర్ మోదీ, దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది. వాటికి సమాధానం చెప్పండి!" అంటూ మూడు సూటి ప్రశ్నలను లేవనెత్తారు.

1. పదేపదే పేపర్ లీక్‌లు ఎందుకు జరుగుతున్నాయి?. 2. ఈ "పరీక్షా పే చర్చ" (పేపర్ లీక్‌లపై చర్చ) విషయంలో మీరెందుకు మౌనంగా ఉంటున్నారు?.

3. పదేపదే విఫలమవుతున్న విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను ఎందుకు పదవి నుంచి తొలగించడం లేదు? ఈ ప్రశ్నలకు ప్రధాని సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. వరుస పేపర్ లీక్‌ల పట్ల కేంద్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి తగదంటూ ఆయన హితవు పలికారు.

## వడగాల్పులకు 3,000 కోళ్లు బలి.. పిడుగుపాటుకు యువకుడు, 30 గొర్రెల మృతి

మొదటి పేజి తరువాయి

మూగజీవాలు బలయ్యాయి. శనివారం ఆదిలాబాద్ జిల్లా బోరాజ్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా 44.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ 42-43 డిగ్రీల ఉష్ణోగ్రతలతో నగరం నిప్పుల కొలిమిలా మారింది. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2-3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ ఎండల తీవ్రతకు వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని ఓ కోళ్లఫారంలో సుమారు 3,000 కోళ్లు మృత్యువాత పడ్డాయి. మరోవైపు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. మార్కెట్ యార్డుల్లోని ధాన్యం రాశులు తడిసి నీటిలో కొట్టుకుపోయాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో పొలంలో పంటను కాపాడుకునే ప్రయత్నంలో పిడుగుపాటుకు గుర్రై నగేష్ (26) అనే యువకుడు మరణించాడు. కొల్లాపూర్ మండలంలో మరో ఘటనలో పిడుగుపాటుకు 30 గొర్రెలు బలయ్యాయి. కాగా, నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల్లోకి ప్రవేశించాయని, మే 26వ తేదీకి అటుఇటుగా కేరళను తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలోని అల్పపీడనం బలహీనపడిందని, ఆదివారం రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురవొచ్చని పేర్కొంది.

## బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవిలో కొనసాగడం దేశానికే అవమానం: కేటీఆర్

అమరావతి: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లో నిర్వహించిన 'నా బూత్- నా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టైన నేపథ్యంలో ఆయన ఈ విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఒక బాలికకు తీవ్ర అన్యాయం జరిగితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మిన్నకుండిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేయాలని చూశాయని విమర్శించారు. కానీ ఆ బాలికకు న్యాయం జరిగేలా బీఆర్ఎస్ పార్టీ మాత్రమే పోరాడిందని తెలిపారు. గత రెండున్నరేళ్లుగా తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. ప్రధాని మోదీ చెబుతున్న 'బేటీ పడావో.. బేటీ బచావో' నినాదం కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు. దేశ చరిత్రలో బహుశా మొదటిసారి ఓ కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ సర్క్యులర్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు. బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసులో విచారణ సరిగా జరగదని అనుమానం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వ్యక్తిని దాదాపు 9 రోజుల పాటు దాచిపెట్టింది కేంద్రమంత్రేనని ఆరోపించారు. బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేసి కేసును నీరుగార్చాలని చూశారన్నారు. ఇలాంటి వ్యక్తులు ఉన్నతమైన పదవుల్లో కొనసాగడం తెలంగాణ రాష్ట్రానికే గాక దేశానికే అవమానమని మండిపడ్డారు.

## వితంతువులకు శుభవార్త.. ఏపీలో జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు

అమరావతి: రాష్ట్రంలోని వితంతువులకు ఏపీలోని కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జూన్ 12వ తేదీ నుంచి కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులు త్వరలోనే ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల అనేక రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వర్షమే!

అమరావతి/హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండలు దంచికొట్టనున్నాయి. రానున్న వారం రోజుల పాటు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మే 19 నుంచి 24వ తేదీ వరకు ఆరు రోజుల పాటు భానుడి ప్రతాపం చుక్కలు చూపించనుందని, బలమైన వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ రోజుల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి రికార్డు స్థాయిలో నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, ఈ ఆరు రోజుల్లో వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండనుంది. దీనివల్ల వడదెబ్బ తగిలి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తాగునీటి బాటిల్‌ను వెంట ఉంచుకోవాలని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, రోగులు ఈ కాలంలో ఎండకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండటం శ్రేయస్కరం.

## శాంతి చర్చలు.. ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠిన షరతులు

ఢిల్లీ: ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చల్లో అమెరికా ఐదు కఠిన షరతులు విధించింది. ఇప్పటి వరకు ఇరాన్‌కు జరిగిన నష్టాలకు ఎలాంటి పరిహారం చెల్లించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఓ నివేదికను విడుదల చేసింది. ఇరాన్ తన వద్ద ఉన్న 400 కిలోల శుద్ధిచేసిన యురేనియంను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసింది. అలాగే ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో కేవలం ఒక్కదానికి మాత్రమే అనుమతి ఇస్తామని పేర్కొంది. విదేశాల్లో స్తంభించిపోయిన ఇరాన్ ఆస్తుల్లో కనీసం 25 శాతాన్ని కూడా విడుదల చేయబోమని తెలిపింది. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణల ముగింపు ఈ చర్చల పురోగతిపైనే ఆధారపడి ఉంటుందని అమెరికా లింక్ పెట్టింది. ఈ ఐదు షరతులకు ఇరాన్ అంగీకరించినా అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ముప్పు అలాగే కొనసాగుతుందని వైనెట్ న్యూస్ అభిప్రాయపడింది. మరోవైపు ఇరాన్ కూడా చర్చల కోసం ఐదు షరతులను విధించింది. ముఖ్యంగా లెబనాన్‌లో ఘర్షణలు ఆపాలని, తమపై ఆంక్షలు ఎత్తివేయాలని, స్తంభించిన నిధులను విడుదల చేయాలని కోరింది. యుద్ధ నష్టపరిహారంతో పాటు హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని డిమాండ్ చేసింది.

## భారత్ చేతిలో కిల్లర్ మిస్సైల్... చైనా నౌక ఫ్యుజియాన్ ను నిమిషాల్లో ధ్వంసం చేయగలదు!

ఢిల్లీ: రక్షణ రంగంలో స్వయం సమృద్ధి దిశగా భారత్ మరో భారీ ముందడుగు వేసింది. శత్రు దేశాల భారీ యుద్ధ నౌకలను, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లను సైతం సముద్రంలోనే జలసమాధి చేయగల అత్యంత శక్తివంతమైన హైపర్‌సోనిక్ క్షిపణిని అభివృద్ధి చేసింది. దీనిని 'ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కిల్లర్'గా అభివర్ణిస్తున్నారు. హిందూ మహాసముద్రంలో చైనా కదలికలకు చెక్ పెట్టేలా దీనిని రూపొందించడం విశేషం. రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ఈ లాంగ్ రేంజ్ యాంటీ-షిప్ హైపర్‌సోనిక్ మిస్సైల్ (ఎల్ఆర్-ఏఎస్ హెచ్ఎం)ను దేశీయంగా అభివృద్ధి చేసింది. ఇది సుమారు 1,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. గంటకు దాదాపు 12,000 కిలోమీటర్ల (మాక్ 8 నుంచి 10) అసాధారణ వేగంతో ప్రయాణించడం దీని అతిపెద్ద బలం. ఈ వేగం కారణంగా శత్రువుల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు దీనిని గుర్తించి అడ్డుకోవడం దాదాపు అసాధ్యం. ఒక వేళ రాడార్ పై కనిపించినా, శత్రు దేశాలు స్పందించేలోపే లక్ష్యాన్ని ఛేదించగల సామర్థ్యం ఆ మిస్సైల్ సొంతం. ఇది 1500 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 7 నిమిషాల 30 సెకన్లలోనే చేరుకుంటుంది అంటే దీని సత్తా ఏంటో అర్థమవుతుంది. చైనా నిర్మించిన అత్యాధునిక 'ఫ్యుజియాన్' విమాన వాహక నౌకను కూడా ఇది నిమిషాల్లో ధ్వంసం చేయగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ క్షిపణి, భారత నౌకాదళంతో యూజర్ ట్రయల్స్‌కు సిద్ధమవుతోంది. ఇటీవల ఒడిశా తీరంలో జరిపిన పరీక్షలు విజయవంతమయ్యాయి. 2027-28 మధ్యలో తుది ట్రయల్స్ ప్రారంభించి, 2029-30 నాటికి పూర్తిస్థాయిలో నౌకాదళంలోకి ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంలో భాగంగా రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు ఓ కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ క్షిపణి వ్యవస్థ అందుబాటులోకి వస్తే హిందూ మహాసముద్రంలో భారత భద్రతా సామర్థ్యం, నిరోధక శక్తి కొత్త శిఖరాలకు చేరుకుంటాయి. సముద్ర తీర ప్రాంత రక్షణ మరింత పటిష్ఠం కానుంది.

## ఆ ఒప్పందం జరిగితేనే భారత్‌తో బంధం.. బంగ్లాదేశ్ కొత్త మెలిక!

ఢిల్లీ: భారత్‌తో సంబంధాలు కొనసాగడం గంగా నది నీటి పంపకాల ఒప్పందంపైనే ఆధారపడి ఉంటుందంటూ బంగ్లాదేశ్ కొత్త మెలిక పెట్టింది. ఈ మేరకు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త ఒప్పందం కోసం చర్చలు జరపాలని భారత్‌ను డిమాండ్ చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఇండో-బంగ్లాదేశ్ గంగా నది నీటి ఒప్పందం 1996లో జరిగింది. అప్పటి ప్రధాని షేక్ హసీనా హయాంలో కుదిరిన ఈ డీల్ ఈ ఏడాది డిసెంబర్‌తో ముగియనుంది. కొత్త ఒప్పందం కుదిరే వరకు పాత ఏర్పాట్లే కొనసాగాలని బంగ్లాదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి మీర్జా ఫక్రుల్ ఇస్లాం ఆలంగీర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో జరిగే నీటి ఒప్పందాలకు కాల పరిమితి ఉండొద్దని ఆలంగీర్ షరతు విధించారు. గంగా నదిని బంగ్లాదేశ్‌లో పద్మా నదిగా పిలుస్తారు. అక్కడి వ్యవసాయం, పర్యావరణం, తాగునీటి వ్యవస్థలకు ఈ నది ఎంతో కీలకం. బంగ్లాదేశ్‌లోని మూడో వంతు జనాభా జీవనోపాధి కోసం ఈ నదిపైనే ఆధారపడుతున్నారు. ఫరక్కా బ్యారేజ్ వల్ల తమకు ఎండాకాలంలో నీటి ప్రవాహం తగ్గిపోతోందని బంగ్లాదేశ్ తెలిపింది. దీనివల్ల నదుల్లో ఉప్పునీరు చేరి పంటలు దెబ్బతింటున్నాయని వాదిస్తోంది. మరోవైపు కోల్‌కతా పోర్టు రక్షణ కోసమే ఫరక్కా బ్యారేజ్ నిర్మించినట్లు భారత్ మొదటి నుంచి చెప్తోంది. ఈ ఇబ్బందులను అధిగమించే పేరిట బంగ్లాదేశ్ పద్మా నదిపై ఓ మెగా బ్యారేజ్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఇది 2033 నాటికి పూర్తి చేయాలని ప్రధాని తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని కమిటీ నిర్ణయించింది. ఈ బ్యారేజ్ నిర్మాణంపై భారత్‌తో సంప్రదింపులు జరపాల్సిన అవసరం లేదని బంగ్లాదేశ్ ఏకపక్షంగా నిర్ణయించింది. మరోవైపు తీస్తా నది నీటి ఒప్పందంపై పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరును కూడా బీఎన్‌పీ నేతలు ఇటీవల విమర్శించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. సువేందు అధికారి నాయకత్వంలో చర్చలు మళ్లీ మొదలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నీటి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఇరు దేశాల మధ్య ప్రత్యేక వేదికలు ఉన్నాయని భారత్ ప్రకటించింది. రెండు దేశాల మధ్య ప్రవహించే 54 నదులపై క్రమబద్ధంగా చర్చలు జరుగుతున్నాయని విదేశాంగ శాఖ తెలిపింది. ఇరు దేశాల ప్రతినిధులు నిరంతరం సమావేశమవుతూనే ఉన్నారని స్పష్టం చేసింది.

# ఫోరెన్సిక్ సైబర్ సెక్యూరిటీలో మాస్టర్స్ పట్టా పొందిన పెద్దారపు ప్రజ్వల

న్యూ జెర్సీ సెయింట్ పీటర్స్ యూనివర్సిటీలో ప్రజ్వల ప్రతిభ

ఆనందం వ్యక్తం చేసిన ప్రజ్వల తల్లిదండ్రులు



ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి,మే(లోకల్ గైడ్ న్యూస్):నర్సంపేట పట్టణానికి చెందిన పెద్దారపు ప్రజ్వల అమెరికాలోని న్యూ జెర్సీలో గల ప్రఖ్యాత సెయింట్ పీటర్స్ యూనివర్సిటీలో ఫోరెన్సిక్ సైన్స్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో ప్రతిభ కనబరిచి మాస్టర్స్ పట్టా సాధించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా పట్టాను ఇచ్చి ఘనంగా సత్కరించారు. దీంతో ప్రజ్వల తల్లిదండ్రులు పెద్దారపు రమేష్,రాధ ఇతర కుటుంబ సభ్యులు హర్షాన్ని వ్యక్తం చేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. విదేశాల్లో ఫోరెన్సిక్ సైన్స్ లో మాస్టర్స్ పట్టా సాధించిన అది కొద్ది మందిలో ప్రజ్వల ఒకరు. ప్రజ్వల ఏడవ తరగతి వరకు నర్సంపేటలో, ఇంటర్ వరకు వరంగల్ లో, ఫోరెన్సిక్ గ్రాడ్యుయేషన్ మధుర ఉత్తర ప్రదేశ్ లో అభ్యసించింది అనంతరం ఫోరెన్సిక్ లో ఉన్నత విద్య అభ్యసించడానికి అమెరికాలోని న్యూ జెర్సీ లో గల సెయింట్ పీటర్స్ యూనివర్సిటీ అడ్మిషన్ ఇవ్వగ ప్రతిభ కనబరిచి మాస్టర్స్ పట్టా పొందడం గర్వించదగింది అని తెలియజేశారు.

# మానవత్వం చాటుకున్న మాదారం 2002 టెన్త్ బ్యాచ్ -భాగ్యలక్ష్మి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్, మే 17 : సింగరేణి మండలం మాదారం గ్రామానికి చెందిన బత్తుల భాగ్యలక్ష్మి ఇటీవల లింగాల క్రాస్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించిన విషయం తెలిసిందే. ఆమె మృతితో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది ఆమెకు భాగ్యలక్ష్మికి వరుణ్, కీర్తన అనే ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఈ విషయం తెలుసుకొని మానవత్వం తో 2002 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు అందరూ కలిసి భాగ్యలక్ష్మి కుటుంబానికి తమవంతు సహాయంగా రూ.16,000 ఆర్థిక సహాయం అందజేశారు. అంతేకాకుండా పిల్లలు పదో తరగతి పూర్తి చేసే వరకు వారికి అవసరమైన పుస్తకాల ఖర్చులను తామే భరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సహాయం పట్ల గ్రామస్తులు మరియు కుటుంబ సభ్యులు 2002 బ్యాచ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో తోడుగా నిలిచిన వారి సేవాభావాన్ని పలువురు అభినందించారు.

# ఆర్ట్స్ కళాశాలలో గుడ్డ సంచుల పంపిణీ!



హనుమకొండ టౌన్,మే17(లోకల్ గైడ్ న్యూస్):పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గుడ్డ సంచుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల్లో ప్లాస్టిక్ వల్ల కలుగుతున్న పర్యావరణ కాలుష్యంపై అవగాహన పెంపొందించేందుకు గుడ్డతో తయారుచేసిన సంచులను పంపిణీ చేసినట్లు ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ప్లాస్టిక్ సంచుల వినియోగం భూమి, జల వనరులు, జీవ వైవిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితమైన గుడ్డ సంచులను వినియోగంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీలత, డాక్టర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక బాధ్యతతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని గుడ్డ సంచుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు.


# 45రోజులుగా సన్‌ఫ్లవర్ ధాన్యం కొనుగోలు లేక రైతుల ఆందోళన



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 17: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్ల రాజీవ్ రహదారిపై అల్లిపూర్ సొసైటీ కార్యాలయం ముందు రైతులు సన్‌ఫ్లవర్ ధాన్యం కొనుగోలు చేయాలని



డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను హరిగోశ పెడుతోందని మండిపడ్డారు. గత 45 రోజులుగా సొసైటీ కార్యాలయం ఆవరణలో సన్‌ఫ్లవర్ ధాన్యం పోసి ఉంచినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని, మండుటెండల్లో రాజీవ్ రహదారిపై కూర్చొని నిరసన తెలుపుతున్నా స్పందించే నాథుడు లేదని రైతులు వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు. రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే సన్‌ఫ్లవర్ ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో పెద్దఎత్తున నిరసనలు, ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ధాన్యం ఎక్కువకాలం నిల్వ ఉండటంతో చెదలు పట్టి పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల గోసను ప్రభుత్వం వెంటనే గుర్తించి సన్‌ఫ్లవర్ ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వినయ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.



# ఎప్సెట్ లో పేట విద్యార్థి ప్రతిభ గురుచరణ్ కు 82 వ ర్యాంక్

నారాయణపేట మే 17:(లోకల్ గైడ్)ఆదివారం విడుదల అయిన ఏప్సెట్ ఫలితాల్లో నారాయణపేట కు చెందిన విద్యార్థి గురుచరణ్ రెడ్డి ప్రతిభ కనబరిచాడు. 82వ ర్యాంక్ సాధించి సత్తా చాటారు.ప్రభుత్వ ఉపాధ్యాయులు తపస్ నాయకులు షేర్ కృష్ణారెడ్డి పారిజాత దంపతుల కుమారుడు గురుచరణ్ రెడ్డి ప్రతిభ చూపి 82వ ర్యాంక్ సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. తల్లి దండ్రులు షేర్ కృష్ణారెడ్డి పారిజాత ఆనందం వ్యక్తం చేశారు.

# బిజెపి రాష్ట్ర చీఫ్ ను కలిసిన రఘు రామయ్య గౌడ్

పార్టీని పటిష్టం చేస్తా



నారాయణపేట మే 17::(లోకల్ గైడ్) ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమించిన సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ .రాంచందర్ రావు ను ఆదివారం కే.రఘు రామయ్య గౌడ్ కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ,పాలమూరు ఎంపీ.డి కే. అరుణమ్మ ,ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఆనంద్ గౌడ్ అని కలసి వారిని శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రఘు రామయ్య గౌడ్ మాట్లాడుతూ నాపై నమ్మకముంచి రాష్ట్ర మోర్చా కమిటీలో అవకాశం కల్పించి న ఎంపీ. అరుణమ్మ ,రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ పాండు రెడ్డి ,జిల్లా మాజీ అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు శ్రీ సత్య యాదవ్,జిల్లా ఇంచార్జి బొక్క బాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని పటిష్టం చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో మహబూబ్ అలీ,జి.ఆర్ రెడ్డి,పగడాకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎస్సీ,మైనార్టీ సెల్ అధ్యక్ష పదవులకు దరఖాస్తు చేసుకోండి

డి సీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి



నారాయణపేట మే 17::(లోకల్ గైడ్)నారాయణపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కొనసా గుతున్న సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు,మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షపదవుల కోసం దరఖా స్తులు చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కే.ప్రశాం త్ కుమార్ రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు.ఈ పదవులకు సేవా భావం, పార్టీ పట్ల నిబ ద్ధత కలిగిన కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు తమ దరఖాస్తులను సమర్పించా లని తెలిపారు.అభ్యర్థి కనీ సం మూడు సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరి ఉండాలనీ,పార్టీ సిద్ధాంతాల కు కట్టుబడి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసే వ్యక్తి అయి ఉండాలనీ తెలిపారు.దరఖాస్తులను ఈ నెల 27 నుంచి 19 వరకు సమర్పిం చాలన్నారు.ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను సమ ర్పించాలని సూచించారు.

# రైతు పక్షపాతి ప్రధాని నరేంద్రమోడీ నందు నామాజీ



నారాయణపేట మే 17(లోకల్ గైడ్): ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా దేశ ఆర్థిక పరిస్థితిని లెక్క చేయకుండా రైతు సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ రైతు పండించిన పంటలకు మద్దతు ధర పెంచి రైతు పక్షపాతిగా నిలిచారని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది,జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర కేబినెట్ లో మరోసారి పంటలకు మద్దతు ధర పెంచి నిర్ణయం తీసుకోవడం రైతుల పట్ల ఉన్న విధేయతకు నిదర్శనం అన్నారు. మద్దతు ధర పెంపుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.రైతు పండించిన పంట కు లాభదాయకమైన గిట్టుబాటు ధరను అందించడమే కాకుం డా రైతు ఆదాయ భద్రతను పటిష్టం చేస్తుందని అన్నారు. దేశ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుంద న్నారు.రైతు సంక్షేమానికి కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు.కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని నరేంద్రమోడీ కి కృతజ్ఞతలు తెలిపారు.

# 19న జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

నారాయణపేట మే 17:(లోకల్ గైడ్) జిల్లా స్థాయి అండర్ 12,14,16 ఏళ్ల లోపు జిల్లా స్థాయి క్రికెట్ జట్లను ఈ నెల 19న నారాయణపేట మినీ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు సమ్మర్ క్రికెట్ క్యాంపు ఇంఛార్జి రమణ తెలిపారు.ఎంపికైన జట్లు త్వరలో ఏం డి సి ఎ ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో ఈ జట్లు నారాయణపేట జిల్లా తరపున పోటీ లో పాల్గొంటాయని తెలిపారు.

# సైబర్ నేరస్థుడిని అరెస్టు చేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు



లోకల్ గైడ్ ‘ ఖమ్మం ఆన్లైన్ లో ట్రేడింగ్ మరియు ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు కోటి రూపాయలు మోసం చేసిన కేసులో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు ఆంధ్ర ప్రదేశ్ రాష్టశీ లోని వెస్ట్ గోదావరి జిల్లాలోని మొగల్తూరు లో అరెస్టు చేసినట్లు ఖమ్మం సి.పి. సునిల్ దత్ గారు తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగిని కి యూట్యూబ్ ప్రకటన ల ద్వారా ఔష్ఫ్‌రాజూజూ గ్రూప్ ల లో పరిచయం అయి ఆన్లైన్ లో ట్రేడింగ్ మరియు ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి వాట్సప్ మరియు ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 13 లక్షలు రూపాయలు ఖాతాలో ఇన్వెస్ట్మెంట్ చెయిన్చి మోసపోయిన కేసులో గాను మరియు వివిధ కేసులలో నిందితుడు గా ఉన్న అక్కౌంట్ హోల్డర్ అయిన కడలి చంద్ర శేఖర్ , వయస్సు 23 సం: లు ను వెస్ట్ గోదావరి జిల్లాలోని మోగల్తూరు లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డి. ఎస్పీ, జ౧.=.౧. ఫణిందర్ గారిని మరియు అట్టి టాస్క్ లో పాల్గొన్న ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ భూక్యా రవి కుమార్ , ఎస్సై లు రశీజిత్ కుమార్ , విజయకుమార్ లను,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస రావు ,కానిస్టేబుల్ భాను మూర్తి మరియు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బం దిని ఖమ్మం జ౧. శ్రీ, సునీల్ దత్, ౖఖా గారు అభినందించారు.

# నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం సమాధానం చెప్పాలి : కొరివి తిరుపతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మే 17:నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని బీఆర్ఎస్ యువజన నాయకులు కొరివి తిరుపతి ముదిరాజ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎంతో కష్టపడి చదివిన లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగానే మరోసారి నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ జరిగిందన్నారు.2024లో జరిగిన నీట్ లీకేజీ ఘటన నుంచి గుణపాఠం నేర్చుకోకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు.నీట్ నిర్వహణ సంస్థ అయిన జాతీయ పరీక్షల సంస్థను తక్షణమే రద్దు చేసి,లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే,విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంత త్వరగా అత్యంత పకడ్బందీగా మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# విద్యార్థుల్లో ధైర్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి: జిల్లా కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 17:ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు విద్యార్థులకు చదువుతో పాటు ధైర్యంగా నిలబడే స్వభావం, మానసిక-శారీరక సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలతో కూడిన మంచి విలువలను అందించాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు 10 థీమ్‌లతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడమేనని పేర్కొన్నారు.విద్యా వారోత్సవాల భాగంగా నిర్వహిస్తున్న విద్య విజయోత్సవం కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఫలితాల కంటే విద్యార్థులకు మంచి విలువలు నేర్పించడం ముఖ్యమని, పరీక్షల్లో కాపీయింగ్‌ను పూర్తిగా నివారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.పిల్లలు పుట్టినప్పటి



నుంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అనుసరిస్తారని, అందువల్ల టీచర్లు విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలంటే పాఠశాల విద్యే బలమైన పునాది అని తెలిపారు.చదువుతో పాటు ధైర్యం, కొత్త నైపుణ్యాలు, కష్టాలను ఎదుర్కొనే మానసిక స్థైర్యం, శారీరక దృఢత్వం వంటి లక్షణాలను పాఠశాలలే నేర్పిస్తాయని పేర్కొన్నారు. పదో తరగతిలో 97 శాతం ఫలితాలు రావడం వెనుక విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని అభినందించారు.ఇంటర్ స్థాయిలో విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణమైన సబ్జెక్టులను ఎంపిక చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, యోగా, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని తెలిపారు.ప్రభుత్వ పాఠశాల విద్యను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహార పథకాన్ని కూడా అమలు చేయబోతుందని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సైతం మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు వెల్లడించారు.అనంతరం పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.10 వేల చెక్కులను, క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుంచి 23 వరకు నిర్వహించనున్న యువత-క్రీడల ప్రోత్సాహక కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రికను కూడా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యత గురువులదే విద్యా విజయోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్ వెల్లడి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), మే 17 : విద్యార్థులకు చక్కటి విద్యా బుద్ధులు నేర్పించి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు సమర్ధవంతంగా నిర్వహించాలని నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో విద్యా విజయోత్సవ దినం నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్ తో పాటు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం





చుట్టారు. వారోత్సవాలలో భాగంగా జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలను, జిల్లా విద్యాశాఖ సాధించిన ప్రగతి గురించి డీ.ఈ.ఓ అశోక్ ముందుగా నివేదిక రూపంలో తెలియజేశారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ, భావి భారత పౌరులైన విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత గురువులదేనని, అందుకే సమాజంలో గురువులకు ఎంతో గౌరవం, గొప్ప స్థానం ఉందని గుర్తు చేశారు. 2047 వరకు భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దాలనే ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పాన్ని సాకారం చేసేవిధంగా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. ఏ లక్ష్య సాధనకైనా చదువు ఎంతో తోడ్పాటును అందిస్తుందని, విద్యతో కూడి ఉన్న జీవితం ఉన్నతంగా ఉంటుందని అన్నారు. విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్న ఫలితంగా ప్రైవేట్, కార్పోరేట్ స్కూల్స్ కు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు నమోదు చేస్తున్నాయని, నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ బడుల విద్యార్థులు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనం అని అన్నారు. అయితే విద్యార్థులు కేవలం మార్కుల సాధనకే పరిమితం కాకుండా, నాణ్యమైన విద్యను ఆర్జించాలని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో మెలుగుతూ, నైతిక విలువలను పెంపొందించు కోవాలని, తల్లిదండ్రులు, గురువుల ఆశీర్వాదం ఉన్నప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగల్గు తామని ఉద్బోధించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, కలలను సాకారం చేసుకునే దిశగా నిజాయితీతో ముందుకు వెళ్లాలని మార్గనిర్దేశం చేశారు. భవిష్యత్తులో స్థిరపడేందుకు పదవ తరగతి తరువాత ఎంచుకునే మార్గం ఎంతో కీలకం అయినందున, మీకు ఇష్టమైన సబ్జెక్టులతో కూడిన కోర్సులలో చేరాలని, ఈ విషయంలో ఎవరు ఏం అనుకుంటారో అనే సంశయాలు, మొహమాటానికి లోను కాకూడదని విద్యార్థులకు సూచించారు. ఎంచుకున్న గమ్యాన్ని ఎలా చేరుకోవాలి అనే దానిపై స్పష్టత కలిగి ఉండాలని, ఆ దిశగా అంకిత భావంతో కృషి చేస్తే తప్పకుండా లక్ష్యాన్ని చేరుకోగల్గుతారని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తన స్వీయ అనుభవాలను గుర్తు చేసుకుంటూ, అపజయాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా నిరంతర కృషి, పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడకుండా పుస్తక పఠనంను అభిరుచిగా మల్చుకోవాలని, ఇది పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందని సూచించారు. బలహీనతలను అధిగమిస్తూ, స్పష్టమైన ప్రణాళికతో కృషి చేస్తే తప్పక విజయం వరిస్తుందని విద్యార్థులకు మార్గోపదేశం చేశారు. ఉపాధ్యాయులు అంటే తనకు ఎంతో గౌరవం అని వెల్లడించిన కలెక్టర్, విద్యార్థులు భవిష్యత్తుకు నష్టం వాటిల్లకుండా తమ గురుతర బాధ్యతకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని సూచించారు. అప్పుడే గురువు అనే స్థానానికి మరింత గౌరవం, వన్నె లభిస్తూ సార్ధకత చేకూరుతుందని అన్నారు. తల్లిదండ్రులు బాలికల పట్ల వివక్షను చూపకుండా వారిని ఉన్నత విద్యను అభ్యసించి అత్యున్నత స్థానాలలో రాణించేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పెంపొందిస్తూ, మెరుగైన విద్యా బోధనకై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని అన్నారు. ఇందులో భాగంగానే అన్ని ప్రభుత్వ బడులలో సీ.ఎం బ్రేక్ ఫాస్ట్ (అల్పాహారం) పథకాన్ని అమలు చేయనుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ మాట్లాడుతూ, విద్యారంగ ప్రాధాన్యతను గుర్తెరిగి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖను తన వద్దే ఉంచుకున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వసతి సదుపాయాలను కల్పిస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ళను నెలకొల్పుతోందని అన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావిస్తూ వారికి నాణ్యమైన విద్యను బోధించాలని, వారి భవిష్యత్తుకు చక్కటి బాటలు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ళలో అత్యధిక మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు నగదు పురస్కారాలు, బహుమతులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహూకరించారు. బాల సాహిత్య విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను అతిథులు తిలకించారు. ఈ కార్యక్రమంలో బీ.సీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు నర్సయ్య, కృష్ణవేణి, జిల్లా పౌర సంబంధాల అధికారిణి ఎన్.పద్మశ్రీ, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, జీఈసీఓ భాగ్యలక్ష్మి, ఎం.ఈ.ఓలు, హెచ్.ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వరి బోనస్ డబ్బులు వెంటనే వేయాలి

బి జేపీ డిమాండ్



నారాయణపేట మే 17:రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లు కు క్వింటాలుకు 500 బోనస్ వేస్తాము అని ప్రకటించి వడ్లు కొనుగోలు కేంద్రాలలో రైతులు అమ్మి 25 రోజులు అయిన కూడా బోనస్ డబ్బులువేయలేదని వెంటనే రైతుల ఖాతాలో వేయాలని కృష్ణ మండల బిజెపి అధ్యక్షుడు నలె నర్సప్ప డిమాండ్ చేశారు.ఆదివారం బిజెపి మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ లు, ప్రధాన కార్యదర్శులు డి రాఘవేంద్ర, తిమ్మాలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొన్న వడ్ల డబ్బులు మాత్రమే రైతుల ఖాతాలలో జమ చేశారనీ గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా యాసంగికి బోనస్ వేసేటట్లు లేరు అని అన్నారు. పెట్టుబడులు ఎక్కువ అయ్యాయి, పంటలు తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గింది వడ్లు అమ్మితే పెట్టుబడి కూడా రాలేదు అని రైతులు దిగులు చెందుతున్నారని అన్నారు. ఒకవేళ ప్రైవేట్ వ్యక్తుల దగ్గర వడ్డీకి తెచ్చి పంటలు పండించిన వారి పరిస్థితి మరి గోరంగా ఉంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యింది సౌకారుల దగ్గరకు అప్పుకు వెళ్తే మునుపు తీసుకున్న అప్పు కడితే కొత్త అప్పు ఇస్తాము అని అంటున్నారని రైతులు వాపోతున్నారని తెలిపారు.రైతులను ఆదుకోవడం కోసం బోనస్ డబ్బులు వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని అన్నారు. అదేవిధంగా యాసంగి రైతు భరోసా కేవలం రెండు ఎకరాలకు మాత్రమే వేసి మౌనం పాటించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించా రు. రైతు భరోసా పంటలు పండే భూములకు మాత్రమే కుటుంబ యూనిట్ గా ఐదు ఎకరాలకా లేక పది ఎకరా లకు ఇస్తారా అని ప్రకటించి ఖరీఫ్, యాసంగిలో సకాలంలో రైతు భరోసా ఇస్తే రైతులకు కొంత ఆసరా అవుతుందని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యింది కావున రైతులను ఆదుకోవడం కోసం వడ్లు అమ్మిన వారికి బోనస్ డబ్బులు, రైతులందరికీ రైతు భరోసా డబ్బులు వేసి రైతుల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

## లేబర్ కార్డుతో ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి - తెలంగాణ ఆల్ బిల్డింగ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నగళ్ల రామచంద్రయ్య .



రాజేంద్రనగర్, (లోకల్ గైడ్ ): లేబర్ కార్డుతో కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఆల్ బిల్డింగ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నగల రాంచంద్రయ్య తెలిపారు. ఆదివారం రాజేంద్రనగర్ జోన్ లోని శివరాంపల్లి లో యూనియన్ ఆధ్వర్యంలో వర్కర్స్ కి రక్షణ పరమైన చర్యలపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్మికులు పనిచేస్తున్న క్రమంలో ముందస్తుగా రక్షణ చర్యలు లేకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి అమావాస్య రోజు కార్మికులు ఎలాంటి పనులకు వెళ్ళరాదని, సెలవుదినంగా పాటించాలని సూచించారు. కార్మికుల సంక్షేమం కోసం ఈ యూనియన్ అవిరాళంగా కృషి చేస్తుందన్నారు. కార్మికులకు ఎవరికైనా ఆపద వచ్చినా, ప్రమాదం జరిగిన వారికి యూనియన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కొందరు యాజమాన్యాలు పనికి ముందు ఒక రేటు, పని ముగిశాక మరో రేటు కూలి ఇవ్వడం తో మోసం చేస్తున్నారని ఇలాంటి ఘటనలు జరగకుండా కార్మికులకు న్యాయం చేసేందుకు యూనియన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్మికులకు పని చేసే క్రమంలో రక్షణ పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు చట్ట ప్రకారం కార్మికులకు పని వేతనాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్ల ఎంతోమంది కార్మికులు భవన నిర్మాణంలో పని చేస్తున్న క్రమంలో ప్రమాదాలకు గురవడమే కాకుండా ప్రాణాలను సైతం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడు యూనియన్ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ముమ్ముందు కార్మికుల సంక్షేమం కోసం యూనియన్ కార్మిక చట్ట ప్రకారం వచ్చే సదుపాయాలు, సౌకర్యాలు, హక్కుల సాధన కోసం యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి ఎన్ యాదగిరి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి రవీందర్ రెడ్డి, యూనియన్ నాయకులు జంగయ్య యాదవ్, యాదయ్య, జంగయ్య, ఎన్ రాజ్ కుమార్, పి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ.





మంచిర్యాల (లోకల్ గైడ్)మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 22వ రోజు ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఉచిత అంబలి పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.వేసవికాలం పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బస్టాండ్,మార్కెట్,ఐబి చౌరస్తా,హమాలీవాడ,సిసిసి కార్నర్,శ్రీరాంపూర్ కాలనీ ఏరియాల్లో,లక్షెట్టీపేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఉత్కూర్ చౌరస్తా వద్ద పలువురు మున్సిపల్ కార్పొరేటర్లు,కౌన్సిలర్లు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు బాటసారులకు అంబలి పంపిణీ చేశారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడమే టియుడబ్ల్యూజే లక్ష్యం.

యూనియన్ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి .

నార్కెట్ పల్లి మండలంలో ముమ్మరంగా సభ్యత్వ నమోదు .



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మే 17 . (లోకల్ గైడ్) జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడమే టియుడబ్ల్యూజే ( ఐజేయు ) లక్ష్యమని ఆ సంఘం నల్లగొండజిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం నార్కటపల్లి లో జరిగిన టి యు డబ్ల్యూ జె సభ్యత్వ నమోదు కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగాజిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జర్నలిస్టుల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ తో పాటు, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం తోపాటు హెల్త్ కార్డులను అందించడానికి యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి జర్నలిస్టుకు యూనియన్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. త్వరలో జరిగే యూనియన్ జిల్లా మహాసభకు జర్నలిస్టు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు పులిమామిడి మహేంద ర్ రెడ్డి, యేళ్ల భయన్న,దేవరశెట్టి నారాయణ, బా శెట్టి శ్రీనివాస్, పసునూరి చంద్రశేఖర్, ప్రజ్ఞాపురం శివశంకర్, ప్రజాపురం కృష్ణ, బండారు రాంబాబు, తిరుమల, రా ధారపు రమేష్, సోమ వెంకటరెడ్డి, మంద చంటి, గర్దాస్ వెంకటేశ్వర్లు,సిరి శెట్టి సంతోష్ టీయూడబ్ల్యూజే సభ్యులు.

# రాష్ట్రస్థాయిలో మెరిసిన నేలకొండపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థిని పొలిశెట్టి నేహ


వ్యాసరచన పోటీలో ద్వితీయ బహుమతి సాధించి కళాశాలకు గౌరవం

మానసిక ఆరోగ్య అంశంపై ప్రతిభకు రాష్ట్రస్థాయి గుర్తింపు

నేలకొండపల్లి ' లోకల్ గైడ్:ఖమ్మం, జిల్లా'నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గువ్వలగూడెం గ్రామానికి చెందిన పొలిశెట్టి నేహ రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలో ద్వితీయ బహుమతి సాధించి కళాశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చింది.సమకాలీన అంశంపై ఆకట్టుకున్న వ్యాసంప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గత ఏడాది అక్టోబర్ 10న కళాశాలలో ఎన్ఎస్ఎస్, మానసిక ఆరోగ్య విభాగం సంయుక్త ఆధ్వర్యంలో “విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల ప్రభావం” అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో నేహ పాల్గొంది. సమాజానికి అత్యంత ప్రాధాన్యమైన అంశంపై ఆమె రాసిన వ్యాసం రాష్ట్రస్థాయి న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని ద్వితీయ బహుమతిని అందించింది.ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పురస్కార స్వీకారంహైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో కళాశాల విద్యా కమిషనర్ దేవసేన చేతుల మీదుగా నేహ జ్ఞాపిక, ప్రశంసాపత్రం, రూ.2,000 నగదు బహుమతిని అందుకుంది.విద్యతో పాటు సేవా



కార్యక్రమాల్లోనూ చురుకైన పాత్రనేహ విద్యాభ్యాసంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటోంది. కళాశాలలో నిర్వహించే ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో జరిగిన ఆపదమిత్ర శిక్షణ, గువ్వలగూడెం గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాల్లో ఆమె సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంది.గ్రామీణ విద్యార్థులకు స్ఫూర్తికళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు సరైన అవకాశాలు, ప్రోత్సాహం లభిస్తే రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటగలరని నేహ నిరూపించిందన్నారు. విద్యతో పాటు సేవాభావం కలిగిన విద్యార్థినిగా ఆమె అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.ఘనంగా సత్కరించిన కళాశాల కుటుంబంరాష్ట్రస్థాయి విజయం సాధించిన నేహను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వరరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ జెడ్. మార్జియానా, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు శాలువాతో సత్కరించి అభినందించారు.కళాశాలకు మరో గర్వకారణంపొలిశెట్టి నేహ సాధించిన ఈ ఘనత ఆమె వ్యక్తిగత ప్రతిభకు నిదర్శనం మాత్రమే కాదు; నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా నాణ్యత, సేవా స్ఫూర్తి, సృజనాత్మకతకు అందిస్తున్న ప్రాధాన్యానికి ప్రతీకగా నిలిచింది. గ్రామీణ యువతకు ఇది స్ఫూర్తిదాయక విజయగాథగా మారింది.




# వడ్డెర జాతి చరిత్రను భావితరాలకు అందించడమే లక్ష్యం

సూర్యవంశం వడియా రాజు క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం”

వడ్డెరలు రాజులు.. రాజకీయంగా ఐక్యమైతే రాజ్యాధికారం సాధ్యం : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

వడియారాజు క్షత్రియ సేవా సమితి డాట్ కం వెబ్‌సైట్ ప్రారంభం

ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన వడ్డెర ప్రతినిధులు

పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



కుత్బుల్లాపూర్ మే 17 (లోకల్ గైడ్ ప్రతినిధి)ఆనంద్ బ్యాంకెట్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సూర్యవంశం వడియా రాజు క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం” ఘనంగా జరిగింది. వడియా క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు కందుల చంద్రశేఖర్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్--ఖమ్మం--నల్గొండ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్ వడ్డెర రాజ్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్లు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వడ్డెర సంఘాల ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు, యువ నాయకులు పాల్గొన్నారు.ఈ సమ్మేళనానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి వడ్డెర, ఒడియరాజు సామాజిక వర్గానికి చెందిన వందలాది మంది హాజరై జాతి ఐక్యతను చాటిచెప్పారు. కార్యక్రమంలో వడ్డెర జాతి చరిత్ర, రాజకీయ సాధికారత, విద్య, యువత భవిష్యత్, సామాజిక ఆత్మగౌరవం, భావితరాలకు చరిత్ర పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.సభ ప్రారంభంలో నిర్వాహకులు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికంగా శాసనాలు దొరికిన సామాజిక వర్గాలలో వడ్డెర జాతికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. చిన్నప్పటి నుంచి “మన పూర్వీకులు రాజులు” అని వింటూ పెరిగామని, కానీ ఆ రాజ్యాలు ఏమయ్యాయి? మన అసలు చరిత్ర ఏమిటి? అనే ప్రశ్నలతోనే తమ ప్రయాణం ప్రారంభమైందని పేర్కొన్నారు.తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా 14 సంవత్సరాల పాటు పనిచేసిన తర్వాత కూడా జాతి చరిత్రపై ఉన్న ఆసక్తి తగ్గలేదని చెప్పారు. అనంతరం ఎల్ఎల్బీ, జర్నలిజంలో మాస్టర్స్, ఎంబీఏ పూర్తి చేసినప్పటికీ, వడ్డెర జాతి చరిత్ర అన్వేషణే తన జీవిత ధ్యేయమైందన్నారు.మన జాతికి ఎంతో గొప్ప చరిత్ర ఉంది. కానీ ఆ చరిత్రను మనమే మరచిపోయాం. నేను తెలుసుకున్న విషయాలు నా దగ్గరే ఉంచుకుంటే ప్రయోజనం లేదు. ప్రతి వడ్డెర బిడ్డలో ఆత్మగౌరవం నింపాలని సంకల్పించాను” అని పేర్కొన్నారు.ప్రతి శని, ఆదివారాలు దేవాలయాలు, పురాతన కట్టడాలు, శాసనాలు, రాజుల చరిత్ర ఉన్న ప్రాంతాలను తిరుగుతూ రెండు దశాబ్దాలుగా పరిశోధనలు చేశామని తెలిపారు. “రెండు నుంచి మూడు కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసి దేశమంతా తిరిగాను. ఎన్నో ఆధారాలు సేకరించాను. ఈ ప్రయాణంలో నా కుటుంబం ఎంతో సహకరించింది” అని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ వడ్డెరలు రాజకీయంగా ఐక్యమైతే రాజ్యాధికారం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. “పేరులోనే ఒడియ రాజు ఉంది. తెలంగాణ శాసనసభలో ఒక్క వడ్డెర ఎమ్మెల్సీ కూడా లేకపోవడం బాధాకరం” అన్నారు.తెలంగాణలో వెలమల కంటే ఎక్కువ జనాభా ఉన్నప్పటికీ వడ్డెరలు అన్ని రంగాల్లో వెనుకబడిపోయారని, దీనికి అగ్రవర్ణ రాజకీయాలే కారణమని ఆరోపించారు. “వడ్డెరలను సమాజంలో దారి దోపిడీ దొంగలుగా చిత్రీకరించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. కానీ అసలైన రాజులు వడ్డెరలే” అని అన్నారు.రాబోయే రోజుల్లో వడ్డెరలు రాజకీయాల్లోకి రావాలని, తమ పార్టీ కూడా వడ్డెరలకు సముచిత స్థానం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. “2029 నాటికి వడ్డెర బిడ్డలు రాజ్యాధికారం సాధించాలి. షేర్లింగంపల్లి కి కాబోయే ఎమ్మెల్యే వడ్డెర బిడ్డే” అని ప్రకటించారు.మావోయిస్టు ఉద్యమం నుంచి ప్రజా రాజకీయాల్లోకి వచ్చిన శంకరన్న భవిష్యత్తులో ఎమ్మెల్యేగా గెలుస్తారని పేర్కొన్నారు. తెలంగాణలో రాబోయేది బీసీల ప్రభుత్వమేనని, అందులో వడ్డెరలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.మన జాతి గొప్పతనాన్ని తెలిపే పాట ఉండాలి.. అక్షరం ఉండాలి.. చరిత్ర ఉండాలి.. యువత అంతా ఐక్యంగా ముందుకు రావాలి” అని సూచించారు.ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ “నా కులమే నా బలం. చదువు, ఆత్మగౌరవం వల్లే ఈ స్థాయికి వచ్చాను. వడ్డెర సమాజం విద్యలో ముందుకు రావాలి” అన్నారు.వడ్డెరలు రాజుల వారసులమని చెప్పుకోవాలంటే విద్య, చైతన్యం, సామాజిక బాధ్యత కూడా అంతే స్థాయిలో ఉండాలని పేర్కొన్నారు.మహిళా డైరెక్టర్ మాట్లాడుతూ వడ్డెర చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావాలని సూచించారు. “మన చరిత్రను భావితరాలకు అందించకపోతే అది మన బాధ్యతా రాహిత్యం అవుతుంది” అని అన్నారు.ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్ వడ్డెర రాజ్ మాట్లాడుతూ వడియా క్షత్రియ సేవా సమితి చేస్తున్న కృషిని అభినందించారు. “ఇది మరో సంఘం కాదు. భావితరాలకు మన చరిత్రను అందించే గొప్ప ఉద్యమం” అని పేర్కొన్నారు.కందుల చంద్రశేఖర్ రాజ్ మరియు ఆయన బృందం పలుమార్లు గుంటూరుకు వచ్చి వడ్డెర జాతి చరిత్ర, భవిష్యత్తు గురించి చర్చించారని తెలిపారు. తెలంగాణలో నిర్వహించే ఈ సమ్మేళనానికి తప్పకుండా వస్తానని ఇచ్చిన మాట ప్రకారమే వచ్చానన్నారు.వడ్డెరలు పూర్వం రాజులుగా పాలించిన చరిత్ర కలిగిన జాతి అని, అనేక దేవాలయాలు, చారిత్రక కట్టడాలు ఒడియరాజుల పాలనలో నిర్మించబడ్డాయని పేర్కొన్నారు. రాజరికం ముగిసిన తర్వాత కూడా దేశ ప్రజల కోసం శ్రామిక జీవనాన్ని ఎంచుకున్న ఏకైక జాతి వడ్డెరలేనన్నారు.మన చరిత్రను చెప్పుకోవడం తప్పు కాదు. నాగార్జునసాగర్ నుంచి ఆల్మట్టి డ్యాం వరకు, ఉస్మానియా యూనివర్సిటీ వరకు ఎన్నో నిర్మాణాల్లో వడ్డెరల శ్రమ ఉంది. ఆ చరిత్రను గర్వంగా చెప్పుకోవాలి” అని అన్నారు.వడ్డెరల మధ్య ఐక్యత అత్యంత అవసరమని, వేర్వేరు సంఘాలు ఉన్నా లక్ష్యం ఒక్కటే కావాలని సూచించారు. “ఎవరినీ విమర్శించకుండా, ప్రతి సంఘాన్ని గౌరవిస్తూ జాతి అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలి” అన్నారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల సంక్షేమానికి, వడ్డెరల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం




ఇస్తున్నారని మల్లె ఈశ్వర్ తెలిపారు. 2014లో వడ్డెర ఫెడరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ ద్వారా నిధులు, ఆదరణ పథకాల కింద పనిముట్లు అందించారని గుర్తుచేశారు.వడ్డెరల తొలి స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వ స్థాయిలో నిర్వహించడం ద్వారా వడ్డెరలకు ఆత్మగౌరవం కల్పించారని చెప్పారు. తెలంగాణలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఓబన్న జయంతి ఘనంగా నిర్వహించబడిందన్నారు.కుల ధ్రువీకరణ పత్రాలలో “వడ్డెర”తో పాటు “ఒడియ రాజు” అనే పదం కూడా చేర్చాలని తీర్మానం చేసినట్లు వెల్లడించారు. భావితరాలకు రాజుల చరిత్రను అందించేందుకు పుస్తకాలు, వెబ్‌సైట్లు, డిజిటల్ వేదికలు సిద్ధం చేయాలని నిర్ణయించామని తెలిపారు.యువత రాజకీయాలు, సాఫ్ట్‌వేర్, వ్యాపారాలు, ఉద్యోగాలు, విద్య రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. “యువతే జాతి భవిష్యత్తు. యువత ముందుకొస్తేనే రాజకీయ సాధికారత సాధ్యం” అన్నారు.ఈ సందర్భంగా “వడియారాజు క్షత్రియ సేవా సమితి డాట్ కం” వెబ్‌సైట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ వెబ్‌సైట్‌లో వడ్డెర చరిత్ర, శాసనాలు, రాజుల వివరాలు, దేవాలయాల చరిత్ర, ఇంటిపేర్ల ఆధారంగా పరిచయాలు, మ్యాట్రిమోనీ సేవలు, మొబైల్ యాప్, సామాజిక అనుసంధాన వేదికలు వంటి అనేక సదుపాయాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.వడ్డెర జాతి చరిత్రను ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ రూపంలో విస్తరింపజేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించారు. విద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ఆర్థిక సాయం అందజేసి ప్రోత్సహించారు.విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి వడ్డెర కుటుంబం తమ పిల్లలను ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించాలని నాయకులు సూచించారు. యువత చదువుతో పాటు చరిత్ర, సంస్కృతి, ఆత్మగౌరవాన్ని కూడా తెలుసుకుని ముందుకు రావాలని పిలుపునిచ్చారు.చివరగా ముఖ్య అతిథులను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. సభలో పాల్గొన్న నాయకులు, యువత, మహిళలు వడ్డెర జాతి ఐక్యతకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



# ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో జాగ్రత్తగా ఉండాలి

ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట మే 17: (లోకల్ గైడ్) ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతు లను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన కల్పిస్తూ అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవి స్తుందని వాటిని అడ్డుకోవ డానికి అప్రమత్తత ప్రధా నాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గావ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ గారు తెలిపారు.

# ఫ్రెండ్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ షేక్ ఖాసిం(ప్రెసిడెంట్



ఖమ్మం :లోకల్ గైడ్ :ఫ్రెండ్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ షేక్ ఖాసిం(ప్రెసిడెంట్) ఈరోజు 300 మందికి మజ్జిగ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం కొత్త బస్టాండ్ నందు నిర్వహించడం జరిగింది. ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ మెంబర్స్ అందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని సకాలంలో నిర్వహించారు. ఇంత ఎండలో కూడా చల్లని మజ్జిగ డిస్ట్రిబ్యూషన్ చేసినందుకు ప్రజలు ట్రస్ట్ మెంబర్స్ అందరికీ సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ మెంబర్స్షేక్ ఖాసిం (ప్రెసిడెంట్), షేక్ కరీమా, పి .అప్పుమ్మ, షేక్. రజియా, ఎం .సుజాత, షేక్ జావిద్, నాగేశ్వరావు, షేక్ సఫియా

# వరి కొనుగోలు వేగం పెంచాలి అదనపు కలెక్టర్ శ్రీను



నారాయణపేట మే 17:లోకల్ గైడ్ :వరి ధాన్యం కొనుగోళ్లను వేగంగా జరపాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను ఆదేశించారు. ఆదివా రం ఆయన దామరగిద్ద మండలంలోని ఆశన్ పల్లి, మద్దూరు మండలంలోనిఖాజీపూర్ ,దమ్ గాన్ పూర్ ఐకెపి, పిఏసిఎస్, మెప్మా వరి కొనుగోలు కేంద్రాలను సంద ర్శించారు. ఈ సందర్భంగా వరిలోని తేమ శాతాన్ని తని ఖీ చేశారు. ప్రభుత్వ నిబంధ నల ప్రకారం కచ్చితంగా వరిని సేకరించాలని ఆయా కేంద్రాల ఇన్చార్జ్‌లను ఆదే శించారు. సేకరించిన వరిని, ట్యాగ్ చేయబడిన రైస్ మిల్లు లకు వెంటనే తరలించేలా చూడాలని సూచించారు.అంతేకాకుండా ఓపిఎం ఎస్ లో రోజువారీ ట్యాబ్ ఎంట్రీల ను ఎలాంటి ఆలస్యం లేకుం డా వేగవంతం చేయాలన్నా రు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి సైదులు, డీ టి లు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు... డిఆర్డిఓ శ్రీరామ్

జాబ్ కార్డు కలిగి ఈ కేవైసీ నమోదు చేసుకున్న వారికి అవకాశం



ఖమ్మం, మే- 17:లోకల్ గైడ్ :జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించే అవకాశం ఉన్నందున, జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నందు జాబ్ కార్డు కలిగి ఈ కేవైసీ ప్రక్రియ నమోదు చేసుకున్న వారికి పనులు కల్పిస్తున్నట్లు ఇట్టి అవకాశాన్ని రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కే.శ్రీరామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం 63 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారని, మే 16న పెండింగ్ లో ఉన్న కూలీల వేతనాలు 16.76 కోట్లు విడుదల అయినట్లు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తూ ఉద్యానవన పంటల సాగు క్రింద మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, వెదురు, జీడిమామిడి, మునగ, కొబ్బరి, శీతాకాలం వంటి తోటల పెంపకానికి ప్రోత్సహించి రైతులకు శాశ్వత ఆదాయ వనరులను కల్పించడం జరుగుతుందని, 5 ఎకరాల లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు అర్హులనీ, జాబ్ కార్డు కలిగిన ప్రతి రైతు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మండల కార్యాలయంలోని ప్రోగ్రాం అధికారి, అదనపు ప్రోగ్రామ్ అధికారిని సంప్రదించాలని డిఆర్డిఓ కే.శ్రీ రామ్ ఆ ప్రకటనలో తెలిపారు.

# టిపిసిసి రాష్ట్ర కన్వీనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు.



బెల్లంపల్లి (లోకల్ గైడ్)గత వారం రోజుల క్రితం గడ్డం వినోద్ ఆదేశాలతో కాంగ్రెస్ జిల్లా,మండల కమీటీలు నియామకంలో భాగంగా జిల్లా జనరల్ సెక్రటరీగా బెల్లంపల్లి మండలానికి చెందిన నలిమల స్వామి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా దుర్గం రాజం లకు పదవులు వచ్చిన సందర్భంగా ఆదివారం టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా ఆయన వారిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పార్టీ పిసిసి,డిసిసి,ఎమ్మెల్యే మీపై నమ్మకంతో పార్టీ బలోపేతం చేయడానికి మీకు పదవులు ఇచ్చారని,పార్టీ బలోపేతానికి అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని కోరారు.అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృతంలో పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తూ నిజమైన లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలని సూచించారు.

# ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి... గిరిజన సంక్షేమం డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి

**అర్హత, ఆసక్తిగల నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు మే 21 లోగా దరఖాస్తులు సమర్పించాలి**

ఖమ్మం, మే- 17:లోకల్ గైడ్ :సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ, భద్రాచలం ఆధ్వర్యంలో 2 నుండి 4 నెలల పాటు వివిధ కోర్సులలో ఉచిత నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు, ఇట్టి అవకాశాన్ని ఖమ్మం జిల్లా పరిధిలో గల నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలనీ గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.టైలరింగ్, జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్, బ్యూటీ తెరపిస్ట్, సిఆర్ఎం డొమెస్టిక్ నాన్ వాయిస్, బ్రైడల్ ఫ్యాషన్ అండ్ మేకప్ ఆర్టిస్ట్ కోర్సులను భద్రాచలంలోనీ గిరిజన భవన్ ప్రక్కన ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్ లో శిక్షణ అందించనున్నట్లు, టైలరింగ్ కోర్సు కు 9వ తరగతి ఆపైన అర్హత, జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్ కొరకు ఇంటర్మీడియట్, మిగతా కోర్సులకు ఎస్సెసి అర్హత ఉండాలని తెలిపారు.అలాగే గెస్ట్ సర్వీస్ అసోసియేట్, గోట్/షీప్ ఫార్మర్, వేర్హౌస్ అసోసియేట్, మైక్రో ఇరిగేషన్ టెక్నీషియన్ కోర్సులను ఇల్లందు సుదిమల్ల యూత్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ అందించ నున్నట్లు, గోట్/షీప్ ఫార్మర్ కొరకు 8వ తరగతి ఆపైన అర్హత, మిగతా కోర్సులకు ఎస్సెసి అర్హత ఉండాలని తెలిపారు.శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫామ్, స్టడీ మెటీరియల్, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందించబడు తుందని, అర్హత గల 18 నుండి 35 సంవత్సరాలు గల గిరిజన యువతీ, యువకులు ఆధార్, కులం, పాస్ ఫోటో, స్టడీ పత్రాలతో కలెక్టరేట్ లోని గిరిజన సంక్షేమ కార్యాలయం (ఎస్ 30)లో మే 21 లోగా తమ దరఖాస్తును సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ డిడి ఆ ప్రకటనలో తెలిపారు.

# ఎప్ సెట్ ఫలితాలలో షాద్ నగర్లోని విశ్వభారతి కళాశాల విజయకేతనం.

రాష్ట్రస్థాయిలో 710 వ ర్యాంకు సాధించిన శుశాంక్ రెడ్డి

ప్రతిభ చాటిన మరో నలుగురు విద్యార్థులు.

ఎప్ సెట్ ఉత్తమ ఫలితాలు విద్యార్థులకు ప్రిన్సిపల్ శివకుమార్ అభినందనలు.




రంగారెడ్డి జిల్లా బ్యూరో, (లోకల్ గైడ్ ) : తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎప్ సెట్ - 2026 ఫలితాలలో షాద్ నగర్ విశ్వభారతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు బై పి సి స్ట్రీమ్ లో సత్తా చాటి భేష్ అనిపించుకొన్నారు. ఈ ఫలితాలలో ఈ కళాశాల విద్యార్థి ఎం. సుశాంక్ రెడ్డి రాష్ట్రస్థాయిలో 710 వ ర్యాంకులు సాధించి కళాశాల కీర్తిని పెంచాడు. అదేవిధంగా మరో నలుగురు విద్యార్థులు గౌరవ సింగ్ 5789, టి.సోనీ 9709, జునైరా మెహ్వష్ 9935, ఎం. అక్షిత 10259 ర్యాంకులను సాధించి సత్తా చాటారు. ర్యాంకులు ( ఉత్తమ ఫలితాలు )సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ శివకుమార్ తో పాటు కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఎంతటి విజయాన్ని అయినా తమ సొంతం చేసుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. తమ కళాశాలలో అనుభవగులైన అధ్యాపకులచే ఉత్తమ విద్యను అందించడం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు కళాశాల యాజమాన్యం అధ్యాపక బృందం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థుల తల్లి కూడా అభినందించారు.

# పెంచిన ధరలు తగ్గించాలని విశ్రాంత కార్మికుల నిరసన.




మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)కేంద్రంలోని బీజేపీ,ఎన్డీఏ ప్రభుత్వం పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలను పెంచినందుకు ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా,అంబేద్కర్ విగ్రహా ఆవరణలో మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు పెంచిన పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తు మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా పేద,మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం మోపుతుందని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.పశ్చిమ ఆసియాలో యుద్ధం కారణంగానే ధరలు పెంచాల్సి వస్తుందని కేంద్ర ప్రభుత్వం చెప్పడం బాధాకరం అన్నారు.యుద్ధ నివారణకు చర్యలు తీసుకోవడం మానేసి,ధరలు పెంచడం బట్టి చూస్తే మధ్య తరగతి ప్రజల నడ్డి విరచడమేనని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం,తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక అధ్యక్షుడు,బీసీ సంఘాల నాయకుడు గజెల్లి వెంకటయ్య,ఉపాధ్యక్షులు భీమ్ సేన్,కార్యదర్శి సతీష్,నాయకులు భిక్షపతి,అశోక్,రాజేశం,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం విజయ వంతం



నారాయణపేట మే 17:(లోకల్ గైడ్)లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట, ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ యురాలజీ వారిచే లయన్ కె. శివకుమార్ రెడ్డి, లయన్ ఎమ్మెల్యే డా. పర్ణికారెడ్డి మార్గదర్శకత్వంలో, ప్రముఖ యురాలజిస్ట్ డా.విశ్వజిత్ రెడ్డి పర్యవేక్షణలో, ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యురాలజీ వారి డాక్టర్ల బృందంచే నారాయణపేట లో ఆదివారం ఎస్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఉచిత వైద్య శిభిరం విజయవంతం అయింది.ఈ శిబిరంలో పలు గ్రామాల నుండి 200 మందికి పైగా ఉచిత సేవలు ఉపయో గించుకున్నారు. వారిలో దాదాపు 80 మందికి పైగా పేషెంట్స్ కి తదుపరి చికిత్స లు అవసరం ఉండగా వారిని ఆసుపత్రులకు వెళ్ళాలని సూచించారు. అక్కడ కూడా అతి తక్కువ ఖర్చుతో చికిత్స అందిస్తామని డా విశ్వజిత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమి టీ చైర్మన్ శివారెడ్డి, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ లయన్ హరినారాయణ భట్టాడ్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సరిత భట్టాడ్, డా విజయ్, కౌన్సిలర్ రాజేష్ ఘూట్, నాయకులు కోట్ల రవీంద్ర రెడ్డి, టౌన్ అధ్యక్షుడు సలీం, వెంకటేష్ గౌడ్ మరియు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# బండి ప్రభాకర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు...



13వ వార్డు ప్రజలు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్ పై13వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ రాజ్ కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలను13వ వార్డు గంగారాం నగర్ ప్రజలు తీవ్రంగా ఖండించారు.ఆదివారం వారు ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతు బండి ప్రభాకర్ వార్డు అభివృద్ధిని కోరుకునేవారని,అలాంటి ఆయన వార్డు అభివృద్ధి చెందుతుంటే అడ్డుపడడం అనేది అవాస్తవం అని అన్నారు.సంబంధిత కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్ మంజూరు కాలేదని పనిని ఆపడం జరిగిందని,అంతేగాని బండి ప్రభాకర్ పై కావాలని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.తాను పదవిలో లేకపోయినా కుంట రాములు బస్తీకి ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యేతో మాట్లాడి10లక్షలతో 20సంవత్సరాలుగా లేని రోడ్డును వేయించిన జన నాయకులు అని అన్నారు.ఆయన కౌన్సిలర్ గా గెలిచిన తన పదవీకాలంలో వార్డును ఎంతో అభివృద్ధి చేసి సిసి రోడ్లు,డ్రైన్లు,విద్యుత్ దీపాలు,ముఖ్యంగా మంచినీటి సమస్య,గణపతి నవరాత్రి ఉత్సవాలు,సద్దుల బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన ప్రజా నాయకుడు అని పేర్కొన్నారు.రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్నప్రభుత్వ పథకాలన్నీ ఇంటింటికి చేరేలా ఎంతో కృషి చేస్తున్నారని.ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో మాట్లాడి ముఖ్యంగా వార్డులో అత్యధికంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు.ఆయన లాంటి అభివృద్ధి చేయడం మీకు చేతకాక తమ నాయకునిపై ఇలాంటి బురద చల్లే ప్రయత్నాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.మరోసారి ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేస్తే ఖబర్దార్ అని,తమ నాయకుడి కోసం తాము దేనికైనా సిద్ధమని అన్నారు.పనిచేయడం చేతగాక తమ నాయకునిపై ఇలాంటి తప్పుడు విమర్శలు చేస్తే సహించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు.సంబందిత కాంట్రాక్టర్ కూడా తనకు పనులు చేయవద్దని ఎవరు చెప్పలేదని చెప్పినట్లు ఆధారాలు ఉన్నాయి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో 13వ వార్డు కాంగ్రెస్ నాయకులు,వార్డు ప్రజలు రాజేశ్వరి,ఇప్ప లక్ష్మి,దేగ లావణ్య,మల్లీశ్వరి,రమ,గదేశి రజిత,అల్లి సాగర్ యాదవ్,రాధారపు వీరయ్య,జాడి మహేష్,మార్కుఖం నరేష్,అమ్ముల శ్రీనివాస్,జహంగీర్,వేముల వెంకటి,నాగనవేణి ఐలయ్య,నాగన వేణి నరేష్,దాసరి అలేఖ్య,మాచర్ల గట్టయ్య,బడికల కిరణ్,జాడీ రవి,దుర్గం నగేష్,దేగ ప్రసాద్,జంగిలి రంజిత్,పోతు మురళి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగిసిన విద్యా వారోత్సవాలు...



బెల్లంపల్లి (లోకల్ గైడ్)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కళాశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు ఆదివారం ముగిసాయని ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు.ఈనెల 11న ప్రారంభమైన వారోత్సవాలు 7రోజుల పాటు వివిధ కార్యక్రమాలు ,ప్రదర్శనలు ,వినూత్నమైన అంశాలతో కొనసాగాయని పేర్కొన్నారు.విద్యా వారోత్సవాల ముగింపు సందర్భంగా బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బి జెడ్ సి విద్యార్థిని సనా అంజుమ్ ను ఘనంగా సన్మానించారు.సాఫ్ట్ బాల్,నెట్ బాల్ పోటీలలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు ఆ విద్యార్థినిని అభినందించారు.భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 5లక్షల సిఎస్ఆర్ నిధులతో మినరల్ వాటర్ ప్లాంటును మంజూరు చేసిన బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యానికి బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరపున ప్రిన్సిపల్ ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మేడ తిరుపతి,పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు,అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 23వ తేదీన జయశంకర్ వర్సిటిలో విత్తన వారోత్సవాలు.

లక్షా యాభై వేల మంది రైతులకు

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో

రైతులు మే 18 నుంచి అడ్వాన్స్

( ముందు)గా బుకింగ్ చేసుకోవాలి:

ఉపకులపతి ప్రొ. అల్దాస్ జానయ్య

రాజేంద్ర నగర్, ( లోకల్ గైడ్ ): ఈ నెల 23వ తేదీ నుంచి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో విత్తన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్తాఫ్ జానయ్య ఓ ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం 1979లో ప్రారంభించిన జాతీయ విత్తన పథకం (నేషనల్ సీడ్ ప్రాజెక్ట్)లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అప్పటి నుంచి కీలక భాగస్వామిగా పనిచేస్తుందన్నారు. ఈ పథకం కింద వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల నుంచి ముందస్తుగా వచ్చే విత్తన ఇండెంట్ల ప్రకారం వివిధ పంటల బ్రీడర్ విత్తనాన్ని ఉత్పత్తి చేసి ఆయా సంస్థలకు నిరంతరం సరఫరా చేయటం జరుగుతుందన్నారు. దీంతో పాటు వివిధ పంటల నాణ్యమైన మూల విత్తనాన్ని (ఫౌండేషన్ సీడ్) విశ్వవిద్యాలయం వివిధ పరిశోధనా కేంద్రాలతో పాటు రైతు విజ్ఞాన కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలలోని క్షేత్రాలలో శాస్త్రవేత్తల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉత్పత్తి చేసి పరిమిత పరిమాణంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల రైతాంగానికి గత ఐదు దశాబ్దాల నుండి సరఫరా చేయడం జరుగుతుందన్నారు.ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమమైన "99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా అగ్రివర్సిటి ఈ నెల 23 నుండి 30 వరకు "విత్తన వారోత్సవాలు" నిర్వహిస్తూ వివిధ జిల్లాలలో వివిధ పంటలకు సంబంధించిన రకాల నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నామని ఉపకులపతి ప్రొ. అల్దాస్ జానయ్య పేర్కొన్నారు.ఈ విత్తన వారోత్సవాలలో భాగంగా అన్ని పంటలకు సంబంధించిన సుమారు 1,231 టన్నుల విత్తనాలను రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,50,000 మంది రైతులకు 27 యూనివర్సిటిల అమ్మక కేంద్రాలలో విక్రయానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మొత్తం రాష్ట్రంలోని విత్తన అవసరాలలో ఇది కేవలం ఒక శాతం అయినప్పటికీ విశ్వవిద్యాలయం ఇస్తున్న మూల విత్తనం ద్వారా వచ్చే దిగుబడిని తిరిగి వచ్చే మూడు సంవత్సరాలు విత్తనంగా వాడుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ప్రస్తుతం మార్కెట్లో కొన్ని నకిలి విత్తన కంపెనీలు రైతాంగానికి పదేపదే మోసం చేస్తున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయం నాణ్యమైన విత్తనోత్పత్తికి ప్రాధాన్యత ఇచ్చి ప్రతి గ్రామాన్ని విత్తనం స్వయం సమృద్ధి సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ప్రతి రైతుకు ఆయా పంటకు సంబంధించి రెండు మూల విత్తన కిట్లు (2 ఎకరాలకు సరిపోయే విత్తనం) మాత్రమే అమ్మబడతాయని, విశ్వవిద్యాలయంలో ఉన్న మూల విత్తనం పరిమితమైన పరిమాణంలో ఉన్నందున మే 18, 2026 నుండి మే 22, 2026 వరకు పట్టిక 3లో తెలిపిన ప్రకారం ఆయా జిల్లాల రైతాంగం విశ్వవిద్యాలయంకు సంబంధించిన సంబంధిత అమ్మక కేంద్రాలలో అడ్వాన్స్ బుకింగ్ చేసుకొనే విధంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని ఉపకులపతి విజ్ఞప్తి చేశారు. ఆయా అమ్మక కేంద్రాలకు సంబంధించిన శాస్త్రవేత్తల పేర్లు మరియు వారి ఫోన్ నెంబర్లు పట్టిక 3లో పొందుపరచడం జరిగిందని, పరిమిత పరిమాణంలో విత్తనాలు అందుబాటులో ఉన్నందున అడ్వాన్స్ బుకింగ్ చేసుకొన్న రైతాంగానికి పంపిణీ చేయగా మిగిలిన విత్తనాన్ని ఆయా కేంద్రాలలో మే 23 నుండి ఇతర రైతులు కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతు సంబంధిత అమ్మక కేంద్రాల నుండి విత్తనం కొనుగోలు చేసేటప్పుడు విశ్వవిద్యాలయ అధికారిక రశీదుతో పాటు సంబంధిత సాంకేతిక పత్రాన్ని విధిగా ఆయా శాస్త్రవేత్తల నుండి పొందాలని కోరారు.

# భవిష్యత్తుకు బలమైన పునాది విద్య.

పదవ తరగతిలో అత్యుత్తమ

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు.

మొదటి స్థానంలో నిలిచిన 13 మంది ప్రభుత్వ పాఠశాలల

విద్యార్థులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయల నగదు

బహుమతి. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .మే 17 .(లోకల్ గైడ్)భవిష్యత్తుకు బలమైన పునాది విద్య అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నల్గొండ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యా విజయోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. మొదటి స్థానంలో నిలిచిన 13 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు.కేజీబి వి మరియు మోడల్ స్కూల్‌లకు చెందిన 5 మంది విద్యార్థులు, స్పోర్ట్స్ స్కూల్ నుండి 4 మంది, జూనియర్ కళాశాలల నుంచి 3 విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఇష్టంతో, కష్టపడి చదవాలని చెప్పారు. పదవ తరగతితో చదువును ఆపకుండా ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించాలని, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదివితేనే నేటి పోటీ ప్రపంచంలో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. గ్రాడ్యుయేషన్ విద్యతో జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. పై చదువులకు వెళ్లే విద్యార్థులకు సరైన దిశానిర్దేశం అవసరమని, ఉపాధ్యాయులు, ఎంఈఓలు విద్యార్థులను ప్రోత్సహించే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ లేదా పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం మానసిక దివ్యాంగులకు అవసరమైన కిట్‌లను జిల్లా కలెక్టర్ అందజేసి వారి పట్ల సామాజిక బాధ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి దస్రునాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి ,ఎంఈఓ లు ,ఉపాధ్యాయులు, విద్యార్థులతల్లిదండ్రులు హాజరయ్యారు.



# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి - జిల్లా ఉపాధ్యక్షులు మురళి

చర్ల మండల నూతన అధ్యక్షుడు విజయ్ నాయుడుకు ఘన సన్మానం



చర్ల : లోకల్ గైడ్ (జిల్లా ప్రతినిధి) :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ నాయుడుకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు మురళి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న, రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పొదెం వీరయ్యల నిర్ణయం మేరకు చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా విజయ్ నాయుడును నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో విజయ్ నాయుడుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి - జిల్లా ఉపాధ్యక్షులు మురళి విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల్లో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన విజయ్ నాయుడును గుర్తించి ఈ పదవి అప్పగించారని తెలిపారు. ఇకపై చర్ల మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, చిన్నా పెద్దా తేడా లేకుండా అందరినీ కలుపుకొని వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు మురళి కోరారు."పదవి అనేది బాధ్యత మాత్రమే... ప్రజల ప్రేమే నాకు అసలైన బలం"మండల అధ్యక్షుడు విజయ్ నాయుడుమండల అధ్యక్షుడు విజయ్ నాయుడు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న, రాష్ట్ర మంత్రులు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, తన రాజకీయ గురువు పీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు మురళికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం తాను చేసిన కృషిని గుర్తించి ఈ పదవిని అప్పగించారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. గతంలో తనకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఖమ్మంలో 108 సిబ్బందికి నీటి కొరత'






లోకల్ గైడ్' (ఖమ్మం)ఖమ్మం: ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని ఆయుష్ ఆరోగ్య కేంద్రం పై అంతస్తులో ఉన్న వసతి గదుల్లో నివసిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు రాత్రింబవళ్లు అత్యవసర సేవలందించే సిబ్బందికి నీటి సరఫరా పునరుద్ధరించేందుకు ఖమ్మం జిల్లా కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పద్మశాలీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి

ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి మే 17 (లోకల్ గైడ్ తెలంగాణ)పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి ఆర్ఆర్ గార్డెన్ పెద్దపల్లి జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాలోని పద్మశాలి ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు



చింతకుంట విజయరమణ రావు అనంతరం జిల్లాలో కొత్తగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులను ఎమ్మెల్యే విజయరమణ రావు సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు విజయరమణ రావు మాట్లాడుతూ కుల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న పద్మశాలీలకు ప్రభుత్వ పక్షాన అందించబడే అన్ని రకాల సంక్షేమ పథకాలను, సొసైటీలకు రాయితీలను అందే విధంగా చూస్తానన్నారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నిటిని త్వరలోనే సంబంధిత చేనేత శాఖామంత్రి తుమ్మల నాగేశ్వర రావు ని కలిసి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా సంఘం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల రామ్మూర్తి, రాష్ట్ర హ్యాండ్లూమ్, టెక్స్ టైల్స్ కార్పొరేషన్ చైర్మన్ దూరం వెంకటరమణ, పద్మశాలి సహకార కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకట్ల రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు వేముల బాలరాజు, ఓదెల మల్లికార్జున దేవస్థానం చైర్మన్ చీకట్ల మల్లయ్య, మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, జిల్లా సంఘం నాయకులు సాయిరి మహేందర్, బొద్దుల లక్ష్మన్, ఐల రమేష్, యాదగిరి, పద్మశాలి సంఘం మండల, పట్టణ శాఖల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 108 అంబులెన్స్‌ను తిరిగి కేటాయించాలి

సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠకు గ్రామస్తుల వినతి



చర్ల : లోకల్ గైడ్ :సత్యనారాయణపురం రైతు వేదికలో ఆదివారం నిర్వహించిన సీతారామ ప్రాజెక్ట్ భూనిర్వాసితుల రైతుల సమావేశం సందర్భంగా భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠను కలిసి సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించిన 108 అంబులెన్స్‌ను తిరిగి కేటాయించాలని ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దానవాయిపేటకు చెందిన రూంజా రాజా మాట్లాడుతూ సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అనేక ఏజెన్సీ గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం 108 అంబులెన్స్ లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని 108 వాహనాన్ని తిరిగి సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, ఇందల రమేష్, రూంజా రాజా, అల్లి ఉమామహేష్, సాంబయ్య, ప్రవీణ్, సురేష్, ఆర్. కొత్తగూడెం, సత్యనారాయణపురం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పింగిలి కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యం --ఎమ్మెల్యే నాయిని



హనుమకొండ జిల్లా ప్రతినిధి,మే17(లోకల్ గైడ్ న్యూస్):ఘననీయమైన విద్య చరిత్ర కలిగిన పింగిలి కళాశాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి తీసుకెళ్తా..హనుమకొండ జిల్లాలో విద్యారంగంలో గణనీయమైన చరిత్ర కలిగిన పింగిలి ప్రభుత్వ కళాశాలను పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం రోజున వడ్డేపల్లి పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తొలుత




కళాశాల,ఆదాయపాకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు.కలశాలకు కావాల్సిన వసతులు, మౌలిక సదుపాయాలు,అభివృద్ధి పనులపై చర్చించారు.అనంతరం సెమినార్ హాల్ లో ఇటీవలే జరిగిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రంలో ర్యాంక్ సాధించిన విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకరంగా రూ. లక్ష రూపాయల చెక్కును విద్యార్థినికి అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్యం,విద్య,వ్యవసాయం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టారని ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలో విద్యా అభ్యసించే విద్యార్థుల కోసం నూతన పథకంలో ప్రవేశ పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు.గత ప్రభుత్వంలో చరిత్ర ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం బడుల్లో చదువుకొని ఉత్తర ప్రతిభ కలిగిన విద్యార్థులకు నగదు రూపంలో బహుమతిని అందించాలని నిర్ణయించడం చాలా గొప్ప విషయం అని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య,భోజనం, వసతి సౌకర్యాలు కల్పించి పేద విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.రానున్న అతికొద్ది రోజుల్లో పింగిలి కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం తరఫున కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


# ప్రతి సంవత్సరం క్రికెట్ పోటీల నిర్వహణ అభినందనీయం...

మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా క్రికెట్ క్రీడాకారుల కోసం స్టిల్ ఫోటోగ్రాఫర్ అడిచర్ల మహేష్ పేరిట క్రికెట్ పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి పేర్కొన్నారు.బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ ఆదేశాల మేరకు పట్టణంలోని స్థానిక తిలక్ స్టేడియంలో ఫోటో గ్రాఫర్ మహేష్ జ్ఞాపకర్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ సీజన్ 2 కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆమె మాట్లాడుతు ఆయన జ్ఞాపకార్థం ప్రతీ సంవత్సరం క్రికెట్ లీగ్ నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషి అభినందనీయం అని అన్నారు.యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా ప్రతిరోజు క్రీడల పట్ల మక్కువ చూపాలని పేర్కొన్నారు.క్రీడల వలన శరీర ధారుఢ్యం పెంపొందడమే కాకుండా మానసిక స్థైర్యాన్ని కల్పిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు ప్రవీణ్,మున్సిపల్ కౌన్సిలర్ లు రాయమల్లు,నిచ్చకొల వంశీకృష్ణ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు రేగుంట రాజలింగు,యువజన నాయకులు చింతల లోకేశ్వర్,టోర్నమెంట్ నిర్వాహకులు,క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకారం కొనసాగిస్తాం : ఐటీసీ ప్రతినిధులు




భద్రాచలం : లోకల్ గైడ్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాల భద్రాచలం అటానమస్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహించిన విద్యా వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు కార్యక్రమంలో సిఎస్ఆర్ దాతలు, ఇతర దాతలను సన్మానించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీసీ డీజీఎం చెంగల్‌రావు హాజరై మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి, విద్యార్థుల సదుపాయాల కల్పనలో ఐటీసీ సంస్థ సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాటర్ కూలర్లు అందించిన రోటరీ క్లబ్ తరఫున డి.వి.కే నాయుడు, కంప్యూటర్ ప్రింటర్ అందించిన సిపిడిసి సభ్యుడు జి. శంకరరావు, కళాశాలకు పూల కుండీలు, మొక్కలు అందించిన మాగంటి వెంకటేశ్వరరావు, ఐటీసీ అసిస్టెంట్ హెచ్ఆర్ మేనేజర్ బి. విశ్వనాథ్ పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, కళాశాల సదుపాయాల పెంపుకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. కళాశాలలో చదివి ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను ఈ కార్యక్రమంలో అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రుసుం కట్టనందుకు బహిష్కరించడం అమానుషం..

మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన సుతారి రమేష్ అనే వ్యక్తి ఊర చెరువులో చేపలు పట్టుకుంటు జీవనం సాగిస్తున్నాడు.ఇతని పేదరికాన్ని గుర్తించిన మంత్రి వివేక్ సూచనతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది.భార్య,కొడుకు కూలీ పని చేసుకుంటు ఇందిరమ్మ ఇంటిని నిర్మాణం చేసుకుంటున్నారు.ఆర్థికంగా వెనుకబడి ఉండటం,ఇల్లు నిర్మించుకోవడం వల్ల చేపల సొసైటీకి చెల్లించాల్సిన రుసుం సుమారు 5వేలకు గాను 3వేల500 చెల్లించి మిగతా 1500కు గడువు అడిగినందుకు ఆగ్రహించిన సొసైటీ అధ్యక్షుడు సుతారి రమేష్ ను చెరువులోకి దిగవద్దని,అంతేకాకుండా ఏకంగా 3సంవత్సరాలు బహిష్కరించడం దారుణమని బాధితుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంత టెక్నాలజీ పెరిగిన ఈ రోజుల్లోను పొట్టకూటి కోసం ఆధారపడిన చెరువు పై ఒక నిరుపేద వ్యక్తిని బహిష్కరించడం అన్యాయం అని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అతని పేదరికాన్ని దృష్టిలో పెట్టుకొని తక్షణమే అతన్ని తిరిగి చెరువులోకి అనుమతించకపోతే సొసైటీ అధ్యక్షునిపై జిల్లా కలెక్టర్ బాధిత కుటుంబంతో పాటు కలిసి పిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మంచి ఫలితాలు ప్రతి ఒక్కరికి తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలి

మండలాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ సన్మానించాలి

ప్రతి హైస్కూల్ పరిధిలో టాపర్ విద్యార్థుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి

పిల్లలు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా పేరేంట్స్ అప్రమత్తంగా ఉండాలి

ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు



నిధి మే 17 (లోకల్ గైడ్ తెలంగాణ)ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యా వారోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష గారితో కలిసి పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావుఅనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి ప్రభుత్వ విప్ విజయరమణ రావు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి 10వ తరగతి ఇంటర్ పరీక్షలో అధిక మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులను సన్మానిస్తూ, వారికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకున్న 98 మందికి పైగా విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించడం ఆనందదాయకమని తెలిపారు. ఈ ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.గత రెండు సంవత్సరాలుగా విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునీకరణ పనులు, టాయిలెట్లు, అదనపు తరగతి గదులు, తాగునీటి సదుపాయాలు, చిన్నపాటి మరమ్మత్తులు వంటి అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి పూర్తి చేశారని అన్నారు.ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రంగా సందర్శించిన తెనుగువాడ పాఠశాల అప్పట్లో శిథిలావస్థలో ఉండేదని, అనంతరం దానిని పూర్తిగా ఆధునీకరణ చేసి ప్రజా ప్రభుత్వంలో అద్భుతంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడం సంతోషకరమని అన్నారు.పెద్దపల్లి పట్టణ పరిధిలో పదవ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన 98 మంది విద్యార్థులు ఉన్నారని, మిగిలిన ఐదు గ్రామీణ మండలాల్లో 138 మందికి పైగా విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరందరికీ రాబోయే రోజుల్లో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మరింత గుర్తింపు లభించడంతో పాటు ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లు చేసిన కృషి సమాజానికి తెలియజేసే అవకాశం ఉంటుందని అన్నారు. వచ్చే ఏడాది సన్మానించే విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మంచి ఫలితాలను ప్రజలకు విస్తృతంగాతెలియజేయాలని కలెక్టర్,సహాఉన్నతాధికారులను ప్రభుత్వ విప్ సూచించారు. ప్రతి హైస్కూల్ పరిధిలో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఇంటర్ చదివే దశలో కొంతమంది విద్యార్థులు చెడు అలవాట్లకు గురయ్యేఅవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జూర్ లో పోలీసుల ఉచిత మెగా వైద్య శిబిరం..

ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి...ఎస్పీ నితికా పంత్.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా బెజ్జూర్ పోలీసుల ఆధ్వర్యంలో మంచిర్యాల మెడిలైఫ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ నితికా పంత్ హాజరై మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించారు.ఈ మెడికల్ క్యాంపులో సుమారు 500మంది ప్రజలు పాల్గొని ఈసీజీ,2డీ ఇకో,షుగర్ పరీక్షలు,బీపీ చెకప్,కంటి పరీక్షలు వంటి వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు.అదేవిధంగా జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, ఆర్థోపెడిక్ ,గైనకాలజీ, రేడియోలజీ, జనరల్ సర్జరీ,న్యూరో ఫిజీషియన్,డెంటల్,ఈ ఎన్ టి వైద్యులు చికిత్సలు నిర్వహించారు.కంటి అద్దాలు అవసరమైన 50మందికి ఉచితంగా కంటి అద్దాలు అందించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతు ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని,ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించవచ్చని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం కోసం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని,ఎలాంటి సమస్య వచ్చినా సమీప పోలీస్ స్టేషన్,డయల్ 100ను సంప్రదించాలని సూచించారు.పోలీసు శాఖ ప్రజల భద్రతతో పాటు వారి ఆరోగ్య సంక్షేమం పట్ల కూడా బాధ్యతతో పనిచేస్తుందని,భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ డిఎస్పి వాహిదుద్దీన్,కౌటాల సిఐ సంతోష్ కుమార్,బెజ్జూర్ ఎస్ఐ సర్తాజ్ పాషా,వైద్య బృందం,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మంచి ఫలితాలు ప్రతి ఒక్కరికి తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలి: ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు



పెద్దపల్లి, మే--17:(లోకల్ గైడ్ )ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మంచి ఫలితాలు ప్రతి ఒక్కరికి తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు తెలిపారు. ఆదివారం ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యా వారోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకున్న 98 మందికి పైగా విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించడం ఆనందదాయకమని తెలిపారు. ఈ ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.గత రెండు సంవత్సరాలుగా విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో రిన్నోవేషన్ పనులు, టాయిలెట్లు, అదనపు తరగతి గదులు, తాగునీటి సదుపాయాలు, చిన్నపాటి మరమ్మత్తులు వంటి అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి పూర్తి చేశారని అన్నారు. ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రంగా సందర్శించిన తెనుగువాడ పాఠశాల అప్పట్లో శిథిలావస్థలో ఉండేదని, అనంతరం దానిని పూర్తిగా రిన్నోవేట్ చేసి కలెక్టర్ ఆధ్వర్యంలో అద్భుతంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడం సంతోషకరమని అన్నారు.పెద్దపల్లి పట్టణ పరిధిలో పదవ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన 98 మంది విద్యార్థులు ఉన్నారని, మిగిలిన ఐదు గ్రామీణ మండలాల్లో 138 మందికి పైగా విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరందరికీ రాబోయే వారం రోజుల్లో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మరింత గుర్తింపు లభించడంతో పాటు ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లు చేసిన కృషి సమాజానికి తెలియజేసే అవకాశం ఉంటుందని అన్నారు. వచ్చే ఏడాది సన్మానించే విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మంచి ఫలితాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని కలెక్టర్ సహా ఉన్నతాధికారులను ప్రభుత్వ విప్ సూచించారు. ప్రతి హైస్కూల్ పరిధిలో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఇంటర్ చదివే దశలో కొంతమంది విద్యార్థులు చెడు అలవాట్లకు గురయ్యే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గత ఏడాదితో పోల్చితే ప్రస్తుత విద్యాసంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో పెద్దపల్లి జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.పదవ తరగతిలో మంచి ఫలితాలు వచ్చాయని అక్కడితో సంతృప్తి చెందకుండా, ఇంటర్మీడియట్‌లో తమ ఆసక్తికి అనుగుణమైన కోర్సుల్లో చేరి మరింత మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ విద్యార్థులు ఇతరులకు స్ఫూర్తిగా నిలిచేలా ఎదగాలని ఆకాంక్షించారు.పెద్దపల్లి జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన గణనీయంగా మెరుగుపడిందని కలెక్టర్ పేర్కొన్నారు.అనంతరం ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష 10వ తరగతి, ఇంటర్ పరీక్షలో అధిక మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులను సన్మానిస్తూ, వారికి రూ.10 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కొండవీటి సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

-పాల్గొన్న..ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

-ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత..ముఖ్య అతిథులు



శేరిలింగంపల్లి, మే 17 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రజల నుంచి విశేష స్పందన పొందింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, ఎంబీసీ చైర్మన్ జైపాల్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య సేవలను పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ..ప్రజల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని, ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్, మహిళా కమిషన్ డైరెక్టర్ జుబేర్ బేగం, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం. రఘునందన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు నర్నె శ్రీనివాస్, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు, టీపీసీసీ లేబర్ సెల్ వైస్ ప్రెసిడెంట్ నల్ల సంజీవ్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అదేవిధంగా మాజీ కాంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ ముఖ్య నాయకులు, మైనార్టీ, యువత, విద్యార్థి విభాగాల నాయకులు, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు వైద్య శిబిరం నిర్వహించిన నిర్వాహకులను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.


## యాదవుల అభ్యున్నతికి కృషి చేయాలి, రఘునాథ్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపిన..మిరియాల ప్రీతమ్

-యాదవ సహకార కార్పొరేషన్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ నాయకులు

శేరిలింగంపల్లి, మే 17 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): తెలంగాణ రాష్ట్ర యాదవ సహకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రఘునాథ్ యాదవ్ ని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిరియాల ప్రీతమ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథ్ యాదవ్ కి పుష్పగుచ్ఛం అందజేసిన మిరియాల ప్రీతమ్, రాష్ట్ర వ్యాప్తంగా యాదవుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ఆయన సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కొత్త బాధ్యతలలో విజయ వంతంగా ముందుకు సాగుతూ, యాదవ సమాజానికి మరింత సేవ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం యాదవుల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, యాదవ సహకార కార్పొరేషన్ ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగవంతంగా అమలు కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానం, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. యాదవుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగ కృష్ణ, మోహిజ్, పరదేశి నాయుడు, సాయి, త్రిలోచన్ తదితరులు పాల్గొని రఘునాథ్ యాదవ్ గారికి శుభాకాంక్షలు తెలిపారు.

## బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

టెక్ పార్క్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న సైబరాబాద్ పోలీసులు



సైబరాబాద్, మే 17 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెంబర్ 684/2026 కేసులో నిందితుడు బండి సాయి భగీరత్ అలియాస్ భగీరత్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్ 64(2)(ఎం), 74, 75తో పాటు పోక్సో చట్టం 2012లోని సెక్షన్ 5(1) రీడ్ విత్ 6 కింద నమోదు చేయబడింది. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు 2026 మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విచారణలో భాగంగా బాధితురాలు, ఇతర సాక్షుల వాంగ్మూలాలను దర్యాప్తు అధికారి నమోదు చేశారు. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా కేసులో సెక్షన్ 64(2)(ఎం) బిఎన్ఎస్ పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రీడ్ విత్ 6ను చేర్చినట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తును కూకట్‌పల్లి డీసీపీ, రితిరాజ్ పర్యవేక్షించారు. అదేవిధంగా బాధితురాలి వాంగ్మూలాన్ని బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 183 ప్రకారం మేజిస్ట్రేట్ ఎదుట నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడి అరెస్టు కోసం పోలీసులు కరీంనగర్, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బృందాలను పంపించారు. నిందితుడు తరచూ వెళ్లే ప్రదేశాలు, అతని పరిచయస్తుల ఇళ్ల వద్ద కూడా గాలింపు చర్యలు చేపట్టారు. అలాగే నిందితుడిపై లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్ఓసి) కూడా జారీ చేశారు. నిందితుడు పోలీస్ అకాడమీ సమీపంలో సంచరిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ క్రమంలో సైబరాబాద్ ఎస్‌వోటీ బృందం నిందితుడు భగీరత్‌ను నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మంచిరేవుల టెక్ పార్క్ సమీపంలో 2026 మే 16 రాత్రి 8:15 గంటలకు అదుపులోకి తీసుకుంది. అనంతరం అతడిని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌లో పంచుల సమక్షంలో నిందితుడిని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం దర్యాప్తు అధికారి అతడిని అధికారికంగా అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షలు పూర్తి చేసిన తర్వాత నిందితుడిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, న్యాయమూర్తి జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.

## ప్రజానాట్యమండలి జిల్లా స్థాయి పాటల శిక్షణ శిబిరాలు ప్రారంభం



ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్, మే 17 : కారేపల్లి మండలం పాటిమిదిగుంపు లో ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా స్థాయి పాటల శిక్షణ శిబిరాలు ఈరోజు కారేపల్లి మండలం పాటి మీద గుంపు గ్రామంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం నాడు పాటల శిక్షణ శిబిరం ప్రారంభ సూచికంగా ప్రజానాట్యమండలి పతాకాన్ని ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు రాష్ట్ర కమిటీ సభ్యులు సుబ్రమణ్య కుమార్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో ఆయన మాట్లాడుతూ ప్రజానాట్యమండలి ప్రజల గొంతు అనీ, తన ఆటపాటలతో ప్రజల పక్షం వహిస్తూ ప్రజా చైతన్యమే పరమావధిగా ముందుకు సాగుతున్నదని అన్నారు ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజల్ని చైతన్య పరిచేందుకు మరింత పదును పెట్టుకోవడానికి ఈ పాటల శిక్షణ శిబిరాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు నిత్యం ప్రజల గొంతుకగా ప్రజానాట్యమండలి నిలుస్తుందని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ పాటల శిక్షణ శిబిరానికి పాటల పెద్దన్న ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు ఏ జగన్ గాయకులకు శిక్షణను ఇచ్చారు మరియు ప్రజా గాయకుడి కర్తవ్యం బోధిస్తూ పాఠాన్ని బోధించారు. ఈ పాటల శిక్షణ శిబిరానికి జిల్లా వ్యాప్తంగా 30 మంది గాయని గాయకులు హాజరయ్యారని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల సదానంద్ జిల్లా ఉపాధ్యక్షులు కే నరేంద్ర నందిగామ కృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొండబోయిన నాగేశ్వరరావు అచ్చి సంఘం డివిజన్ నాయకురాలు ఉమా మాజీ సర్పంచ్ రామ్బాయమ్మ,, ధనమ్మ ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు కరకపల్లి రాయమల్లు సనంతరావు కండి సత్యం బిక్షం ఉపేందర్ గోపాల్ వీరబాబు చరణ్ మంగమ్మ అలివేలు లలిత శ్రీలత, రైతు సంఘం నాయకులు వజ్రామారావు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు శోభన్ బాబు, సోషల్ మీడియా కన్వీనర్ ధరావత్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే లక్ష్యం ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తాం

తరుగు పేరుతో వేధిస్తే మిల్లులపై కఠిన చర్యలు!

167 కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక అధికారుల నియామకం

మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,400 మద్దతు ధర

జిల్లా కలెక్టర్ అంకిత్ క్షేత్రస్థాయి కార్యాచరణ

భద్రాద్రికొత్తగూడెం, లోకల్ గైడ్ :రైతన్న ఆరుగాలం శ్రమించి పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతుల ప్రయోజనాల పరిరక్షణలో ఎటువంటి రాజీ పడే ప్రసక్తే లేదని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ?రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

### 167 కేంద్రాలకు ప్రత్యేక అధికారులు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన 167 కొనుగోలు కేంద్రాలకు 167 మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. కేంద్రాల్లో రైతులు ఎదుర్కొనే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా ఈ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేస్తారని వెల్లడించారు. ?రైతులకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, తార్పాలిన్లు, తూకం యంత్రాలు,




హమాలీలు, రవాణా సదుపాయాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన పంటను వెంటనే నిల్వ కేంద్రాలకు తరలించేలా సమన్వయ చర్యలు చేపట్టామన్నారు.రికార్డు స్థాయిలో మొక్కజొన్న దిగుబడిరూ.2,400 మద్దతు ధర?జిల్లాలో ఈ ఏడాది మొత్తం 94,198 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరగగా, సుమారు 2,44,915 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు కలెక్టర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,400 చొప్పున రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు.?మొక్కజొన్న కొనుగోళ్ల ప్రగతి ఒక పరిశీలనమొత్తం కొనుగోలు లక్ష్యం 94,822 మెట్రిక్ టన్నులు కాగా ?ఇప్పటివరకు సేకరించింది 32,546.350 మెట్రిక్ టన్నులని, ?గోదాములకు తరలించింది 19,595.350 మెట్రిక్ టన్నులని, ?తరలింపునకు సిద్ధంగా ఉన్నది 12,951 మెట్రిక్ టన్నులని, ?కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు పేరుకుపోకుండా లారీల కొరత లేకుండా చూస్తూ, నిరంతర లోడింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 6,50,927 గన్నీ బ్యాగులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయన్నారు.నిల్వ సామర్థ్యం సిద్ధం ప్రత్యామ్నాయాలపై నిఘా మొక్కజొన్న నిల్వ కోసం జిల్లాలోని కొదాడ, బాదలాపురం, మత్తంపల్లి, కుక్కడాం, కారేపల్లి, ఇల్లందు, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి ప్రాంతాల్లోని శాస్త్రీయ గోదాములను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 41,814 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాముల్లో ప్రస్తుతం 19,622 మెట్రిక్ టన్నుల స్థలం వినియోగంలో ఉండగా, ఇంకా 22,192 మెట్రిక్ టన్నుల ఖాళీ స్థలం అందుబాటులో ఉందన్నారు. ?అంతేకాకుండా, ఈ ఏడాది ధాన్యం దిగుబడి అధికంగా ఉన్నందున ముందస్తు జాగ్రత్తగా ఫంక్షన్ హాళ్లు, పాఠశాల భవనాలు, ఇతర గోదాములను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా సిద్ధం చేశామని చెప్పారు.మిల్లుల తరుగు ఆటలు సాగవు కలెక్టర్ హెచ్చరిక ధాన్యం తేమ శాతం, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని కలెక్టర్ గట్టిగా హెచ్చరించారు. ముఖ్యంగా రైస్ మిల్లర్లు తరుగు పేరుతో అనవసర కోతలు విధిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.?రైతులు కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే సంబంధిత ప్రత్యేక అధికారులను లేదా జిల్లా అధికారులను సంప్రదించాలని సూచించారు. అన్నదాతలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని కలెక్టర్ అంకిత్ భరోసా ఇచ్చారు.

## కలిసికట్టుగా పోరాడితేనే రాజ్యాధికారం

-మున్నారు కాపుల ఐక్యత సమావేశంలో నేతల పిలుపు




పెద్దపల్లి , మే 17:(లోకల్ గైడ్ )రాజ్యాధికారంలో సముచిత వాటా కోసం ఐక్యంగా పోరాడాలని మున్నారు కాపుల ఐక్యత సమావేశంలో కాపునేతల పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రలో నిర్వహించిన మున్నూరు కాపు సమావేశంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక సాధికారత కోసం మున్నూరు కాపులు ఐక్యతతో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. మున్నూరు కాపులకు చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని, నామినేటెడ్ పదవుల్లో తగిన వాటా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రాజకీయంగా, సామాజికంగా బలపడాలంటే అన్ని వర్గాలను కలుపుకొని సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.రాజ్యాధికారంలో భాగస్వామ్యం సాధించాలంటే ముందుగా మున్నూరు కాపులు ఆర్థికంగా బలోపేతం కావాలని, విద్యా మరియు ఉద్యోగ రంగాల్లో మరింత ముందుకు రావాలని నాయకులు సూచించారు. రాష్ట్రంలో మున్నూరు కాపుల జనాభాను తక్కువగా చూపుతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేసారు.వాస్తవ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు మరియు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా మున్నూరు కాపులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కూడా వారు డిమాండ్ చేశారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం ఇంచార్జ్ ఈసంపల్లి వెంకన్న పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మరియు పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎలువక రాజయ్య, మున్నూరు కాపు యూత్ రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్, అమిరిశెట్టి రామాస్వామి, జడల సురేందర్ పటేల్, మల్కా రాజేశం, శ్రీధర్ పటేల్, ఆకుల కిరణ్ పటేల్ (మంథని నియోజకవర్గ కోఆర్డినేటర్), వెంకన్న పటేల్ (మంథని మార్కెట్), కొత్త శ్రీనివాస్ (పాక్స్ చైర్మన్, మంథని) తదితరులతో పాటు ప్రజాప్రతినిధులు, మున్నూరు కాపు సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఊరట

ప్రత్యేక కమిటీ ఏర్పాటు పట్ల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హర్షం



జనగామ జిల్లా.మే 17.లోకల్ గైడ్ ):-తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలు సేవలను గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై జనగామ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈగం శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ నిర్ణయం అని శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేకమంది ఉద్యమకారులు చేసిన త్యాగాలు పోరాటాలను గుర్తిస్తూ వారికి న్యాయం చేయాలనే దీర్ఘకాలిక డిమాండ్ కు ప్రభుత్వం స్పందించింది అన్నారు ఉద్యమకారులకు గౌరవం కల్పించే దిశగా తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని తెలిపారు ఆనాడు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయుట లో కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందన్నారు. ఈనాడు తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని నిర్ణయంతో కేకే కమిటీని జీవో నెంబర్ 679 ఏర్పాటు చేసింది అని అన్నారు. 14 సంవత్సరాలు ఉద్యమ సమయం మరియు రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడుస్తున్న నేటి ఈ నిర్ణయం ఉద్యమకారుల కు ఒక శుభ పరిణామమని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి మరియు సంబంధిత మంత్రివర్గానికి, కమిటీ చైర్మన్ మరియు సభ్యులకు అదేవిధంగా తెలంగాణ ఉద్యమ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అయిటిపాముల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన భువనగిరిఎంపీ, నకిరేకల్ ఎమ్మెల్యే.

రైతులకు అండగా ఉంటాం: భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి , ఎమ్మెల్యే వీరేశం ల భరోసా.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మే 17.(లోకల్ గైడ్)కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి , ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కలిసి పరిశీలించారు .ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతుల నుండి ధాన్యం సేకరణ ప్రక్రియ, తూకం విధానం, తరలింపు ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు."రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది" అని స్పష్టం చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, నీడ, తార్పాలిన్లు, విశ్రాంతి స్థలం అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దళారుల ప్రమేయం లేకుండా, పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని సూచించారు.భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ " రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నది . 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ అయ్యేలా పర్యవేక్షిస్తున్నాం" అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## నూతన కమిటీలు మరింత నూతన ఉత్సహంతో ప్రజలకు సేవ చేయాలి: డాక్టర్ కోట నీలిమ



కుత్బుల్లాపూర్ మే 17 (లోకల్ గైడ్ ప్రతినిధి)సనత్ నగర్ నియోజకవర్గంలోని ఎనిమిది డివిజన్లకు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మరింత నూతన ఉత్సాహంతో ప్రజలకు సేవ చేయాలని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. తాజాగా సనత్ నగర్ డివిజన్ అధ్యక్షుడిగా అబ్బాస్ షరీఫ్, దీఖ గూడ అధ్యక్షుడిగా రవి కాంత్, ఎస్సార్ నగర్ డివిజన్ అధ్యక్షుడిగా దేవులపల్లి రవికిరణ్, అమీర్ పేట్ అధ్యక్షుడిగా శ్రీకాంత్ యాదవ్, బేగంపేట్ అధ్యక్షుడిగా మహమ్మద్ నసీర్, రాంగోపాల్ పేట్ అధ్యక్షుడిగా త్రికాల మనోజ్ కుమార్,పద్మారావు నగర్ అధ్యక్షుడిగా జగదీశ్, బన్సీలాల్ పేట్ అధ్యక్షుడిగా రమేష్ బాబు నియమితులయ్యారు. తాజాగా వారు నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు డాక్టర్ కోట నీలిమ, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్ కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తామని, ప్రజల్లోకి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను మరింత బలంగా తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన 8 మంది అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించారు. ఈ క్రమంలో డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నూతన కమిటీలపై ఉందన్నారు. ప్రతి డివిజన్‌లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ముందుండాలని కోరారు. రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీలు నూతన ఉత్సాహంతో పార్టీ విజయానికి కృషి చేయాలని, ప్రతి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని ఆమె అన్నారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేస్తే సనత్ నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలమైన స్థానం లభిస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

## పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా.

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .మే 17. (లోకల్ గైడ్)భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్న



పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం ఆయన తన కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## అండమాన్ ను తాకిన నైరుతి రుతుపవనాలు



న్యూఢిల్లీ : నైరుతి రుతుపవనాలు అండమాన్ దీవులను తాకినట్లు తాకినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. నైరుతి రుతుపవనాలు ముందుగా అంచనా వేసినట్లుగానే ఆగ్నేయ అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, నికోబార్ దీవులతో పాటు అండమాన్ రాజధాని శ్రీ విజయ పుర వరకు విస్తరించాయని ఐఎండి శనివారం వెల్లడించింది. రాబోయే మూడు-నాలుగు రోజుల్లో, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, అలాగే నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తాయని పేర్కొంది. రుతుపవనాలు ముందుకు సాగడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. నైరుతి రుతుపవనాలు మే 26నాటికి కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ కాలంలో దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. 'ఎల్ నినో' కారణంగా ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని సూచించింది.

## శత్రువుల అయుధాల రవాణాను అనుమతించం: ఇరాన్




టెహ్రాన్ : శత్రువుల ఆయుధాలను ఇకపై కీలకమైన హార్ముజ్ జలసంధి ద్వారా ప్రయాణించేందుకు అనుమతించమని ఇరాన్ ప్రథమ ఉపాధ్యాక్షుడు మొహమ్మద్ రెజా అరెఫ్ పేర్కొన్నారు. హార్ముజ్ పై సార్వభౌమత్వాన్ని వదులుకున్నామని, తమపై ప్రయోగించేందుకు ఉద్దేశించిన ఆయుధాలను కూడా గతంలో ఈ జలసంధి నుండి రవాణా అయ్యేందుకు అనుమతించామని అన్నారు. ఇకపై వాటిని అనుమతించమని స్పష్టం చేశారు. హార్ముజ్ జలసంధిలో నిర్దేశిత మార్గం ద్వారా సముద్ర రవాణాను నియంత్రించడానికి ఇరాన్ ఒక యంత్రాంగాన్ని సిద్ధం చేసిందని ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రతా కమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం అజీజీ పేర్కొన్నారు. త్వరలో యంత్రాంగంను ప్రవేశపెడతామని అన్నారు. ఈ యంత్రాంగం ఇరాన్ సార్వభౌమాధికారం పరిధిలో, అంతర్జాతీయ వాణిజ్య భద్రతను నిర్ధారించే లక్ష్యంతో అభివృద్ధి చేశామని అన్నారు. ఈ యంత్రాంగంతో వాణిజ్య నౌకలు, ఇరాన్ కు సహకరించే పక్షాలు మాత్రమే ప్రయోజనం పొందుతాయని అన్నారు. -ఫ్రీడమ్ ప్రాజెక్ట్' (అమెరికా) సంస్థతో సంబంధం ఉన్న సంస్థలకు ప్రతిపాదిత మార్గం మూసివేసి ఉంటుందని అన్నారు.

## మండుటెండలు .. వడగాలులు.. ఉక్కపోత ..!



అమరావతి : రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాలులు, ఉక్కపోత తీవ్రత పెరుగుతోందని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. ఆదివారం కర్నూలు జిల్లా నగరడోనలో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు. కర్నూలు జిల్లాలో 12 మండలాలు, నంద్యాల 10, కడప జిల్లాలో 6 మండలాలు మొత్తంగా 9 జిల్లాల పరిధిలోని 41మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. నేడు విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, మార్కాపురం, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాల్లో ఎండ ప్రభావం ఎక్కువగా ఉండి 42 నుంచి 44.5 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశం ఉందని తెలిపారు. రేపు మన్యం జిల్లా సీతంపేట మండలంలో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని మరో 34 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని వెల్లడించారు. మరోవైపు నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని తెలిపారు. వీటి ప్రభావంతో రేపు పార్వతీపురం మన్యం, అల్లూరి, పోలవరం, తూర్పుగోదావరి, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఉరుములతో వర్షం పడేటప్పుడు పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు చెట్ల కింద నిలబడకూడదని హెచ్చరించారు. పగటిపూట ప్రయాణించేవారు టోపీలు, మాస్కులు, మహిళలైతే ముఖానికి వస్త్రాలు రక్షణగా ధరిస్తున్నారు. ఇక విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు ఎండలోనే ప్రయాణిస్తున్నారు. కొందరు వేసవి నుంచి ఉపశమనం కోసం చలివేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కొందరు కొబ్బరి బోండాలు, శీతల పానీయాల బండ్ల వద్దకు చేరుతున్నారు. ఎండాకాలంలో ఎక్కడెక్కడో పని చేసుకొని ఇంటికి వచ్చేసరికి అలసట వచ్చేస్తుంది. చిన్న చిన్న పనులకే నీరసపడిపోతుంటాం. అలవాటు ఉన్న వాళ్లు అలసట బారి నుంచి ఉపశమనం పొందడానికి టీ, కాఫీ తీసుకుంటారు. కానీ వేసవిలో వేడి పదార్థాలు పెద్దగా రుచించవు. కాస్త చల్లచల్లగా ఏవైనా పండ్ల రసాలు తీసుకుంటే బాగుంటుంది అనిపిస్తుంది. సహజ పానీయాలైన పళ్ల రసాలను తీసుకోవడమే మంచిదని, తద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని, అలసట దూరమవుతుందని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.

## రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో భారీ అగ్నిప్రమాదం



భోపాల్: మధ్యప్రదేశ్‌లోని రత్లాం జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున తిరువనంతపురం-హజ్రత్ నిజాముద్దీన్ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదంతో అప్రమత్తమైన సిబ్బంది 68 మంది ప్రయాణికులతో ఉన్న కోచ్‌ను 15 నిమిషాల్లోనే సురక్షితంగా ఖాళీ చేయించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. రైల్వే అధికారుల ప్రకారం, తిరువనంతపురం నుంచి ఢిల్లీకి ప్రయాణిస్తున్న 12431 నంబరు గల రైలులోని బి-1 కోచ్‌లో ఉదయం 5.15 గంటల ప్రాంతంలో ఈ మంటలు చెలరేగాయి. కోటా రైల్వే డివిజన్ పరిధిలోని విక్రమ్‌గఢ్ ఆలోట్,లునిరిచా స్టేషన్ల మధ్య ఈ సంఘటన జరిగిందని రత్లాం డివిజన్ పీఆర్ఓ ముఖేష్ కుమార్ తెలిపారు. ఈ రైలు ఉదయం 3.45 గంటల ప్రాంతంలో రత్లాం జంక్షన్ నుంచి బయలుదేరింది. ఈ ఘటన ఢిల్లీ-ముంబై రైలు మార్గంలో రైళ్ల రాకపోకలపై ప్రభావం చూపింది, కనీసం ఐదు నుంచి ఆరు రైళ్ల షెడ్యూళ్లకు అంతరాయం కలిగింది. ఈ ఘటన తర్వాత పలు రైళ్లను వివిధ స్టేషన్లలో నిలిపివేశారని అధికారులు తెలిపారు. ప్రమాదం, రైళ్ల రాకపోకల అంతరాయంపై ప్రయాణికుల సౌకర్యార్థం కోసం రైల్వే అధికారులు హెల్ప్‌లైన్లను అందుబాటులోకి తెచ్చారు.

# వెండి దిగుమతులపై ఆంక్షలు

### 'రిస్ట్రిక్టెడ్' విభాగంలోకి మార్చిన ప్రభుత్వం
### దీంతో ఇకపై దిగుమతులకు డీజీఎఫ్‌టీ అనుమతి తప్పనిసరి
### కడ్డీలు, ఆభరణాలు మొదలైన వాటికి వర్తింపు
### అనుమతి తీసుకున్నా గరిష్టంగా 100 కేజీలకే పరిమితం.. సెజ్‌లు, ఎగుమతి ఆధారిత కంపెనీలకు మాత్రం మినహాయింపు
### తాజా నియంత్రణలతో రేట్లకు రెక్కలు

బిజినెస్ డెస్క్: పశ్చిమాసియా సంక్షోభం వేళ విదేశీ మారక (డాలర్ల) నిల్వలను కాపాడుకునే క్రమంలో దిగుమతులను కట్టడి చేసే దిశగా కేంద్రం మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పసిడి, వెండి, ప్లాటినంలపై సుంకాలను పెంచిన ప్రభుత్వం వెండికి సంబంధించి మరిన్ని నియంత్రణలను ప్రకటించింది. ఇప్పటి వరకు స్వేచ్ఛగా దిగుమతి చేసుకునే (ఫ్రీ ఇంపోర్ట్) కేటగిరీలో ఉన్న వెండిని ఆంక్షలు వర్తించే 'రిస్ట్రిక్టెడ్' కేటగిరీలోకి మార్చింది. దీనితో ఈ విభాగంలోని ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలంటే ప్రభుత్వం నుంచి లైసెన్సు అవసరం ఉంటుంది. తాజా పరిణామంతో ఇకపై 99.9 శాతం స్వచ్ఛత కలిగిన వెండి కడ్డీలు, సెమీప్రాసెస్డ్ సిల్వర్, సిల్వర్ పౌడర్, సాదా వెండి ఆభరణాల్లాంటి ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలియున్నా డీజీఎఫ్‌టీ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్) నుంచి ప్రత్యేక అనుముఘతులు అవసరమవుతాయి. అయితే, 100 శాతం ఎగుమతి ఆధారిత యూయినిట్లు (ఈవోయూ), ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)లోని యూనిట్లకు ఈ ఆంక్షలు వర్తించవు. కాకపోతే, అవి దిగుమతి చేసుకున్న వాటిని భారత మార్కెట్లో విక్రయించకుండా, పూర్తిగా ఎగుమతి మాత్రమే చేయాల్సి ఉంటుంది. పైపెచ్చు ముందస్తు అనుమతి తీసుకున్నా సరే... ఒకసారి 100 కిలోలకన్నా ఎక్కువ పరిమాణంలో దిగుమతి చేసుకోవటానికి అనుమతించరు. ఇక ఎగుమతి ఆధారిత యూనిట్లు తొలుత దిగుమతి చేసుకున్న వెండిని వినియోగించి... అందులో కనీసం 50 శాతాన్ని ఎగుమతి చేసినట్లు నిరూపిస్తేనే మరోసారి దిగుమతికి అనుమతిస్తారు. విలువైన లోహాల దిగుమతి కోసం విదేశీ మారక నిల్వలను భారీగా వెచ్చించాల్సి వస్తుండటంతో పసిడితో పాటు వెండి దిగుమతులపై కేంద్రం సుంకాలను ఆరు శాతం నుంచి 15 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే.



### 12 బిలియన్ డాలర్ల దిగుమతులు

భారత దిగుమతుల్లో వెండి వాటా ఏడాదికి దాదాపు 7 వేల నుంచి 9 వేల టన్నుల వరకు ఉంటోంది. కేంద్ర వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం 2025-- 26లో వెండి దిగుమతులు పరిమాణం పరంగా 42 శాతం పెరిగి 7,335 టన్నులకు చేరాయి. విలువపరంగా 150 శాతం పెరిగి 12 బిలియన్ డాలర్లకు ఎగుశాయి. అంతర్జాతీయంగా ధరలు పెరగడమే ఇందుకు కారణం. దిగుమతి చేసుకునే వాటిల్లో ప్రధానంగా సిల్వర్ పౌడర్, బులియన్ కడ్డీలు, ముడి రూపంలోని వెండి ఉంటున్నాయి. కొత్త నిబంధనలతో వెండి దిగుమతుల్లో సింహభాగానికి డీజీఎఫ్‌టీ అనుమతి తప్పనిసరి కానుంది.

### ఎందుకీ నిర్ణయాలు

కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా మూడు లక్ష్యాలతో ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సంక్లిష్ట పరిస్థితుల్లో అత్యంత విలువైన ఫారెక్స్ నిల్వలను కాపాడుకోవడం అందులో ఒకటి. అలాగే వివిధ దేశాలతో పెరిగిపోతున్న వాణిజ్య లోటును నియంత్రించడం మరో లక్ష్యం. థాయ్‌లాండ్, యూఏఈలాంటి దేశాలతో భారత్‌కి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) ఉన్నాయి. దీనితో సుంకాల భారం భారీగా ఉండకుండా, ఆయా దేశాల మార్గం గుండా దిగుమతి చేసుకుంటున్నారని ప్రభుత్వం భావిస్తోంది. కనుక, ఎఫ్‌టీఏల దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికి కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

### సాధారణ ప్రజలపై ప్రభావం ఏంటంటే..

ఆభరణాలు ప్రియం..: అంతర్జాతీయంగా వెండి ధరలు భారీ స్థాయిలోనే కదలాడుతున్నాయి. ఇటీవలి సుంకాల విధింపుతో సిల్వర్ ధరలు ఒక్కసారిగా ఎగిశాయి. దీనికి తోడు ఇక సంక్లిష్టమైన లైసెన్సు ప్రక్రియ కూడా తోడైతే దిగుమతుల్లో జాప్యానికి దారి తీయొచ్చు. ఫలితంగా దేశీయంగా డిమాండ్, అలాగే ధరలు కూడా భారీగా ఎగిసే అవకాశం ఉంది. మన దగ్గర శుభకార్యాలు, ఇతరత్రా గిఫ్ట్ ఐటెమ్స్‌లో వెండి వినియోగం ఎక్కువే ఉంటోంది. అయితే, చిన్న వ్యాపారులు, ఆభరణాల తయారీదార్లకు ముడి వస్తువు వ్యయాలు పెరుగుతాయి కాబట్టి ఆ మేరకు వాటి రేట్లు కూడా పెరిగిపోతాయి.

స్మగ్లింగ్ ముప్పు..: దిగుమతి సుంకాలను పెంచినప్పుడే స్మగ్లింగ్ ముప్పులపై ఆందోళన వ్యక్తమైంది. ఇప్పుడు మరిన్ని నియంత్రణల వల్ల ఈ రిస్కులు ఇంకా పెరుగుతాయని పరిశ్రమవర్గాలు అంటున్నాయి.

పరిశ్రమలకు షాక్..: కేవలం ఆభరణాలకే పరిమితం కాకుండా ఇతరత్రా పారిశ్రామిక అవసరాలకు కూడా వెండి వినియోగం గణనీయంగా పెరిగింది. సోలార్ ప్యానెళ్లు, ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ పరికరాలు .. ఇలా ఒకటేమిటి, అనేక అవసరాల కోసం సిల్వర్‌ని పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. తాజా నియంత్రణల వల్ల ఆయా పరిశ్రమలకు ముడి వస్తువు ఖర్చులు పెరిగిపోతాయి. ఫలితంగా అవి తయారు చేసే ఉత్పత్తుల ధరలూ పెరుగుతాయి.

### పెట్టుబడులకు కొనసాగనున్న ఆసక్తి..

పసిడితో పాటు ఇన్వెస్టర్లు ఇప్పుడు వెండిని కూడా ఓ కీలకమైన పెట్టుబడి సాధనంగా పరిగణిస్తున్నారు. బంగారంతో పోలిస్తే అందుబాటు స్థాయిలో ఉండటంతో రేట్లలో తీవ్ర హెచ్చుతగ్గులు ఉంటున్నా సిల్వర్‌వైపు మొగ్గు చూపుతున్నారు. కాబట్టి పెట్టుబడి సాధనంగా ఇన్వెస్టర్ల కోణంలో దీనికి డిమాండ్ కొనసాగుతుందని నిపుణులు చెబుతున్నారు.

# అస్పష్ట 'శిఖరాగ్రం'!

దశాబ్దకాలంగా ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక, ఇంధన రంగాల్లో పరస్పరం తలపడుతూ, వాటితోపాటే ఒకదానిపై మరొకటి అవిశ్వాసాన్ని దండిగా పెంచుకున్న రెండు అగ్ర రాజ్యాలు చర్చలకు సిద్ధపడ్డాయంటే ప్రపంచం చాలా ఆశిస్తుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బుధవారం బీజింగ్ చేరుకున్నప్పుడు ఆయనకు లభించిన స్వాగత సత్కారాలు గమనించినా, శిఖరాగ్ర సమావేశం జరిగిన గురు, శుక్రవారాల్లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై ఆయన కురిపించిన ప్రశంసలు చూసినా అంతా సవ్యంగా ముగిసిందని అనిపిస్తుంది. ట్రంప్‌తో వచ్చిన ప్రతినిధి బృందం సామాన్యమైనది కాదు. భిన్నరంగాల్లో ప్రపంచాన్నేలుతున్న దిగ్గజ సంస్థల చీఫ్‌లు 16 మంది ఆ బృందంలో ఉన్నారు. టెస్లా, స్పేస్ ఎక్స్‌ల సీఈఓ ఎలాన్ మస్క్, యాపిల్ చీఫ్ టిమ్ కుక్‌లతోపాటు ఎన్‌విడియా, క్వాల్‌కామ్, బ్లాక్‌రాక్, గోల్డ్‌మాన్ శాక్స్, బోయింగ్, మెటా సంస్థల సీఈఓలు వారిలో కొందరు. చైనాతో అద్భుతమైన ఒప్పందాలు కుదిరాయనీ, అవి ఇరు దేశాలకూ ఎంతో గొప్పవనీ ట్రంప్ ప్రకటించినా ఆ ఒప్పందాల వైనమేమిటో ఎవరికీ తెలియదు. బోయింగ్ సంస్థకు చెందిన 200 జెట్ విమానాలు వెంటనే, భవిష్యత్తులో మరో 750 కొనడానికి చైనా అంగీకరించిందనీ... అలాగే వందలకోట్ల డాలర్ల విలువైన సోయాబీన్స్ కొనుగోలు చేయడానికి కూడా ఒప్పుకున్నదనీ ట్రంప్ చివరిలో వివరించారు. కానీ అందుకు సంబంధించి ఎలాంటి ప్రకటనలూ రాలేదు. లిఖితపూర్వక ఒప్పందాలు కుదిరిన దాఖలా లేదు. ప్రాథమిక చర్చలవరకూ జరిగి ఉంటాయన్నది దౌత్యరంగ నిపుణుల అభిప్రాయం. ఇరు దేశాలమధ్యా సాగిన సుంకాల యుద్ధం సామాన్యమైనది కాదు. ట్రంప్ సుంకాలు ప్రకటించిన ప్పుడల్లా చైనా దీటుగా స్పందించి ప్రతీకార సుంకాలు విధిస్తూ పోయింది. అరుదైన ఖనిజాల ఎగుమతుల్ని చైనా నిలిపేయటంతో అమెరికా విలవిల్లాడింది. ఇక కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో ఆధిపత్యం కోసం రెండూ హోరాహోరీ పోటీ పడుతున్నాయి. ఎన్‌విడియా అత్యాధునిక చిప్‌లు కావాలని చైనా కోరుతుండగా భద్రతా కారణాల రీత్యా కుదరదన్నది అమెరికా వాదన. బహుశా చైనా ఆశలు ఈడేరకపోవటంవల్ల... కొన్ని అంశాల్లో పట్టు సడలించటానికి అమెరికా నిరాకరించటంవల్ల ఒప్పందాలపై ప్రాథమిక చర్చలే సాగాయని అనుకోవాలి. కనీసం వచ్చే సెప్టెంబర్‌లో షీ అమెరికా పర్యటన నాటికైనా స్పష్టత వస్తే మంచిదే. ప్రపంచం మునుపటి తీరుగా లేదని మాత్రం ట్రంప్‌కు అర్థమై ఉంటుంది. ఎందుకంటే తైవాన్ విషయంలో తమకంటూ ఒక 'రెడ్‌లైన్' ఉన్నదని షీ జిన్‌పింగ్ నిర్మొహ మాటంగా చెప్పారని మీడియా అంటున్నది. అయితే తైవాన్‌పై గత వైఖరే కొనసాగుతుందని ట్రంప్‌తో వచ్చిన అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో చెప్పటం మినహా మరేదీ బయటకు రాలేదు. తమ సొంతమని చైనా చెబుతున్న తైవాన్‌ను స్వతంత్ర, స్వయంపాలిత, ప్రజాస్వామిక



దేశంగా మనుగడ సాగించనీయాలన్నది అమెరికా వాదన. 1979 నుంచి దానితో సంబంధాలు నెరపుతున్నా అవన్నీ 'అనధికారమైనవి'. కానీ తైవాన్‌కు ఆయుధ విక్రయం జరపాలని ఇటీవల అమెరికా అనుకోవటాన్ని చైనా తీవ్రంగా పరిగణిస్తోంది. అందుకే ఈ 'రెడ్‌లైన్' హెచ్చరిక. ఇక ఇరాన్ యుద్ధం, హార్మూజ్ జలసంధివద్ద ఉద్రిక్తతలపైనా ఇరు దేశాలూ ఒకే అభిప్రాయంతో ఉన్నట్టు పైకి అంటున్నా వాటిపైనా స్పష్టత లేదు. ఈ పర్యటన తర్వాత హార్మూజ్ వద్ద సామరస్యత ఏర్పడు తుందేమో చూడాలి. దౌత్య పరిభాషలో మర్యాదపూర్వకమైన పదాలు చాలా ఉంటాయి. అందులో రెండు దేశాలమధ్యా కుదిరిందని చెబుతున్న విజన్ కొత్తది. 'నిర్మాణాత్మక వ్యూహాత్మక స్థిరత్వం' అనే ఈ విజన్ అర్థం 'పూర్తిగా స్నేహితులం కాలేకపోయినా, శత్రువులుగా మారి యుద్ధా నికి దిగొద్దు' అన్నదే. సారాంశంలో పూర్వపు సోవియెట్ అధినేత కృశ్చేవ్ బోధించిన 'శాంతియుత పోటీ' వంటిది. నిజానికి ట్రంప్ పర్యటన ఆంతర్యం ఇదే. తమతో సరి సమాన స్థాయికి ఎదిగిన చైనాతో ఇరాన్, తైవాన్ ల విషయంలో స్పర్థ రాకూడదని ఆయన కోరుకుంటున్నారు. ఆ పరిమితుల్లో చూస్తే ట్రంప్ పర్యటన విజయవంతమైందను కోవాలి. కానీ ట్రంప్ ఏలుబడిలో అమెరికా ఏ మేరకు ఒదిగి ఉంటుంది... చైనా ఏ స్థాయి వరకూ తగ్గివున్నట్టు కనబడుతుందన్నది రానున్న కాలమే చెబుతుంది.

# విద్యార్థులతో చెలగాటం!

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణాలకు ఆలవాలంగా మారడం గర్హనీయం. ఈ నెల 3న జరిగిన నీట్ యుజి 2026 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలడంతో పరీక్షను రద్దు చేసి, సిబిఐ విచారణకు జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్ టిఎ) ఆదేశించింది. పేపర్ లీక్, పరీక్ష రద్దుతో 22 లక్షల మంది విద్యార్థులు అనవసరమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలకు 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సీకర్‌లో వాట్సాప్ లో అందుబాటు లోకి వచ్చిన 'అంచనా పేపర్- లో కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 120 నుంచి 140 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చాయంటే పరీక్ష నిర్వహణలో డొల్లతనం వెల్లడవుతుంది. ఈ పేపర్‌లోని ప్రశ్నలు ప్రిపేరైన విద్యార్థులు 720 మార్కుల్లో 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చన్నది నిపుణుల మాట. ఈ నెల 1 నుండి అంచనా పేపర్ అభ్యర్థులకు చేరిందని, రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విక్రయించారని అధికారులు గుర్తించి, పలువురు నిందితులను అరెస్టు చేశారు. దేశంలో వైద్య విద్య పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికే అందుబాటులో ఉంది. సామాన్యులు వైద్య విద్య చదివించడం దాదాపు అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రతి రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకునేది. 2017లో మోడీ ప్రభుత్వం కేంద్రీకరణ విధానాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టిఎ) తీసుకొచ్చి, రాష్ట్రాల పరిధిలో ఉన్న వైద్య విద్య ప్రవేశార్హత నీట్ లో భాగం చేశారు. అన్ని పరీక్షలను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలన్న మోడీ ప్రభుత్వ విధానంతో లీక్ లు, అవకతవకలు షరా మామూలుగా మారిపోయాయి. నీట్ విధానం అన్యాయమని, ఈ విధానాన్ని రద్దు చేసి, వికేంద్రీకరించాలని దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. మోడీ అడుగులకు మడుగులొత్తుతున్న రాష్ట్రంలోని గత, ప్రస్తుత ప్రభుత్వాలు మిన్నకున్నాయి.

దాదాపు 400 మందితో ఏర్పడిన ఎన్ టిఎ నీట్ సహా 46 పరీక్షలను సమన్వయం చేయాల్సి ఉండటం, అందులోనూ




ఆర్ఎస్ఎస్, కమలం పార్టీ కుదురు నుంచి వచ్చిన అనర్హులు, అక్రమార్కులు భాగస్వాములు కావడం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. నాలుగు సార్లు నీట్, ఒకసారి యుజిసి నెట్ లీక్ కావడమే ఇందుకు నిదర్శనం. 2024లో నీట్ యుజి పరీక్ష అవకతవకలపై బీహార్‌లో అరెస్టులు, సకాలంలో పేపర్ ఇవ్వకపోవడం వల్ల గ్రేస్ మార్క్ లు ఇవ్వాల్సి రావడం సహా ఎన్నో అంశాలు చర్చనీయాంశమయ్యాయి. పూర్తి భద్రతా ప్రోటోకాల్ పాటించామని, జిపిఎస్ ట్రాక్ చేసిన వాహనాలు, ఎ.ఐ నియంత్రిత సిసి టివి, బయోమెట్రిక్, 5 జి జామర్లు వంటి చర్యలు తీసుకున్నామని ఎన్ టిఎ చెబుతున్నా అక్రమాలు జరుగుతున్నాయంటేనే... పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో వైఫల్యం కనిపిస్తోంది. విద్యార్థుల కలలను భగ్నం చేసే పేపర్ లీక్ లను అడ్డుకోకపోగా, కనీసం నోరుమెదపని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం సిగ్గుచేటు. పరీక్షా పే చర్చ అంటూ విద్యార్థులతో చర్చించే ప్రధానికి ఏటా జరుగుతున్న పేపర్ లీక్ లపై నోరుపెగలడం లేదు. ఏళ్ల తరబడి అవిశ్రాంతంగా శ్రమించి సిద్ధమవుతున్న విద్యార్థులు మరోసారి మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, అనిశ్చితితో శిక్ష అనుభవిస్తున్నారు. వ్యవస్థ ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంటే మోడీ కా గ్యారెంటీ ఏమైందనే ప్రశ్న ముందుకు వస్తోంది. పేపర్ లీక్ పై కేంద్రప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలి.

లోకల్ గైడ్
జాతీయ దినపత్రిక
LOCAL NEWS GOBAL FOCUS
తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్

సోమవారం - 18 -మే - 2026

# 2030 నాటికి భారత ఆర్థిక వ్యవస్థకు ఏఐ జోష్

## 500 బిలియన్ డాలర్ల సంపద సృష్టే లక్ష్యం!

ఐబీఎం - ఇండియాఏఐ సంయుక్త నివేదిక

భారతదేశం మరో పారిశ్రామిక విప్లవానికి వేదిక కాబోతోంది. 2030 నాటికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత దేశ ఆర్థిక వ్యవస్థకు ఏకంగా 500 బిలియన్ డాలర్లకు పైగా అదనపు విలువను జోడించనుందని తాజా నివేదిక వెల్లడించింది. ఐబీఎం ఇన్‌స్టిట్యూట్ ఫర్ బిజినెస్ వాల్యూ, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖకు చెందిన 'ఇండియాఏఐ' సంయుక్తంగా రూపొందించిన 'ప్రామిస్ టు పవర్: హౌ ఏఐ ఈజ్ రిడిఫైనింగ్ ఇండియా ఎకనామిక్ ఫ్యూచర్' అనే నివేదికలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.



### ఆశయం గొప్పదే.. కానీ..

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని నివేదిక ఆశాభావం వ్యక్తం చేసింది. సర్వేలో పాల్గొన్న 73% మంది వ్యాపార దిగ్గజాలు 2030 నాటికి భారత్ ప్రపంచ ఏఐ లీడర్‌గా అవతరిస్తుందని నమ్ముతున్నారు. ఐదుగురు వ్యాపారవేత్తలలో నలుగురు ఏఐ పెట్టుబడులు నేరుగా దేశ జీడీపీ వృద్ధిని ప్రభావితం చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. అయితే, వాస్తవ పరిస్థితులు కొంత ఆందోళనకరంగా ఉన్నాయి. సర్వే చేసిన సంస్థల్లో 72% సంస్థలు అంతర్జాతీయ పోటీతో పోలిస్తే తాము ఏఐ అమలులో వెనుకబడి ఉన్నామని అంగీకరించాయి. ఆశయానికి, ఆచరణకు మధ్య ఉన్న ఈ అంతరాన్ని తగ్గించడమే ఇప్పుడు దేశం ముందున్న ప్రధాన సవాలు.

### 35 కోట్ల మంది నిపుణులు అవసరం

ఈ నివేదిక ప్రధానంగా నైపుణ్యాల కొరతను ఎత్తిచూపింది. 'ప్రస్తుతం కేవలం 30% మంది ఉద్యోగులకు మాత్రమే ఏఐ పరిజ్ఞానం ఉంది. 2030 నాటికి ఈ అవసరాలు తీరాలంటే దేశవ్యాప్తంగా 350 మిలియన్ల (35 కోట్లు) ఏఐ నిపుణులు అవసరమవుతారు' అని అంచనా వేసింది. కేవలం సాంకేతికత ఉండటం ముఖ్యం కాదు. ఆ సాంకేతికతను నడిపించే నైపుణ్యం గల మానవ వనరులు ఉండటమే అసలైన విజయమని నివేదిక పేర్కొంది.

### డేటా సార్వభౌమాధికారం

డేటా భద్రత, నియంత్రణ విషయంలో భారతీయ కంపెనీలు కఠినంగా ఉన్నాయి. 74% మంది ఎగ్జిక్యూటివ్‌లు డేటాపై పూర్తి నియంత్రణ ఉండాలని కోరుకుంటున్నారు. ఖర్చును తగ్గించుకుంటూనే పనితీరును మెరుగుపరచుకోవడానికి 10 మందిలో ఏడుగురు హైబ్రిడ్ క్లౌడ్ నమూనా వైపు మొగ్గు చూపుతున్నారు. స్వదేశీ క్లౌడ్ మౌలిక సదుపాయాలు లేకపోవడం (77%), డేటా నాణ్యత సరిగ్గా లేకపోవడం (57%) ఏఐ విస్తరణకు ప్రధాన అడ్డంకులుగా మారాయి. భారతదేశం కేవలం ఏఐ వినియోగదారుగా మాత్రమే కాకుండా సృష్టికర్తగా ఎదగాలంటే 'ఇండియాఏఐ ఫ్యూచర్ స్కిల్స్' వంటి కార్యక్రమాలు క్షేత్రస్థాయికి వెళ్లాలి. ముఖ్యంగా టైర్ 2, టైర్ 3 నగరాల్లో ఏఐ ల్యాబ్‌ల ఏర్పాటు ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రతిభను ఒడిసిపట్టాలి. అప్పుడే 500 బిలియన్ డాలర్ల కల సాకారమవుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు సమన్వయంతో పనిచేసి విప్లవాత్మక మార్పులు తెస్తేనే ఈ ఏఐ స్వప్నం సాకారం అవుతుందంటున్నారు.

# గూగుల్ ఉచిత స్టోరేజ్‌పై నియంత్రణ

టెక్ దిగ్గజం గూగుల్ తన వినియోగదారులకు షాకిచ్చేలా ఉచిత క్లౌడ్ స్టోరేజ్ విధానంలో కీలక మార్పులను చేపట్టింది. ఇప్పటివరకు కొత్తగా జీమెయిల్ ఖాతా తెరిచిన ప్రతి ఒక్కరికీ లభించే 15 జీబీ ఉచిత స్టోరేజ్ పరిమితిని కేవలం 5 జీబీకి తగ్గించేలా ఒక కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలిస్తోంది. కొత్తగా గూగుల్ ఖాతా సృష్టించుకునే వారు తమ ఫోన్ నంబర్‌ను అనుసంధానం చేసి వెరిఫై చేయకపోతే కేవలం 5 జీబీ స్టోరేజ్ మాత్రమే లభిస్తుంది. ఈ విషయాన్ని ప్రముఖ టెక్ వేదిక 'ఆండ్రాయిడ్ అథారిటీ' ఆధ్వర్యంలో గూగుల్ అధికారికంగా ధ్రువీకరించింది. మొదట ఈ మార్పును ఒక రెడ్డిట్ వినియోగదారుడు గుర్తించి వెలుగులోకి తెచ్చారు.

### గూగుల్ వివరణ ఏమిటి?

ఉచిత స్టోరేజ్ పరిమితి తగ్గింపుపై వస్తున్న వార్తలపై గూగుల్ స్పందించింది. 'అత్యుత్తమ నాణ్యత కలిగిన క్లౌడ్ స్టోరేజ్ సేవలను నిరంతరాయంగా అందించడమే మా లక్ష్యం. అందులో భాగంగానే నిర్దిష్ట ప్రాంతాల్లో ఈ కొత్త స్టోరేజ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నాం. దీనివల్ల భద్రత పెరగడమే కాకుండా, డేటా రికవరీ ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది' అని గూగుల్ పేర్కొంది. అయితే, ఈ విధానాన్ని ప్రపంచవ్యాప్తంగా అందరికీ వర్తింపజేస్తారా లేదా అనే అంశంపై కంపెనీ ఇంకా ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతానికి ఈ నిబంధన కేవలం కొత్తగా క్రియేట్ చేసే ఖాతాలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది.

కొత్త స్టోరేజీ పాలసీ ఎలా పనిచేస్తుంది?

సాధారణంగా గూగుల్ ఖాతా ఉన్న ప్రతి ఒక్కరికీ జీమెయిల్, గూగుల్ డ్రైవ్, గూగుల్ ఫోటోస్ వంటి సేవలన్నింటికీ కలిపి ఉమ్మడిగా 15 జీబీ ఉచిత స్టోరేజ్ లభిస్తుంది. గూగుల్ ఎకోసిస్టమ్‌ను వాడటానికి వినియోగదారులను ఆకర్షించే అతిపెద్ద ఫీచర్ ఇదే.



### ప్రస్తుత పరీక్షల ప్రకారం..

డిఫాల్ట్ లిమిట్ – 5 జీబీ: కొత్త టెస్ట్ అకౌంట్ సిస్టమ్ కింద సైన్ అప్ అయ్యే వారికి ప్రాథమికంగా 5 జీబీ మాత్రమే ఉచితంగా ఇస్తున్నారు. పూర్తి 15 జీబీ పొందాలంటే: కొత్త వినియోగదారులు తప్పనిసరిగా తమ ఫోన్ నంబర్‌ను అందించి ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. అలా చేస్తేనే మిగిలిన 10 జీబీ అన్‌లాక్ అయి మొత్తం 15 జీబీ స్టోరేజ్ అందుబాటులోకి వస్తుంది.

### ఫోన్ నంబర్ వెరిఫికేషన్ ఎందుకు?

ఒక్కరే వందలాది నకిలీ (ఫేక్) ఖాతాలను సృష్టించి ఉచితంగా లభించే 15 జీబీ స్టోరేజ్ ఆఫర్లను దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవడమే గూగుల్ ప్రధాన ఉద్దేశం. ఫోన్ నంబర్ లింక్ చేయడం ద్వారా ఒక వ్యక్తికి ఒకే ఉచిత స్టోరేజ్ ప్రయోజనం చేకూరుతుందని గూగుల్ భావిస్తోంది. అంతేకాకుండా వినియోగదారులు ఎప్పుడైనా తమ పాస్‌వర్డ్ మర్చిపోయినా లేదా ఖాతా హ్యాకింగ్‌కు గురైనా.. ఫోన్ నంబర్ ద్వారా సులభంగా రికవర్ చేసుకోవచ్చని కంపెనీ చెబుతోంది. ప్రస్తుతం ఆఫ్రికా వంటి కొన్ని ఎంపిక చేసిన అంతర్జాతీయ ప్రాంతాల్లో ఈ మార్పును వినియోగదారులు గమనించారు. భారతదేశంలోనూ కొత్త ఖాతా తెరిచే సమయంలో తప్పనిసరిగా ఫోన్ నంబర్ అడుగుతున్నట్లు కొందరు యూజర్లు సోషల్ మీడియా ద్వారా నివేదిస్తున్నారు.

### స్టోరేజీని గూగుల్ నిజంగానే తగ్గిస్తోందా?

ప్రస్తుతానికి గూగుల్ ఈ విధానాన్ని ఒక ప్రయోగంగా మాత్రమే చెబుతోంది తప్ప, ఉచిత స్టోరేజీని శాశ్వతంగా తగ్గిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించలేదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ల నిర్వహణ ఖర్చులు, వాటికి పెరుగుతున్న డిమాండ్ వల్లే టెక్ కంపెనీలు ఉచిత సేవలను పరిమితం చేస్తున్నాయనే ప్రచారం జరుగుతున్నప్పటికీ.. గూగుల్ దీనిని ధ్రువీకరించలేదు.

# మన శరీరంలో అనేక విధులను నిర్వహించే ఈ పోషక పదార్థం గురించి మీకు తెలుసా.. దీన్ని ఎలా పొందాలంటే..




మన శరీరంలో అనేక జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేందుకు, శరీరానికి శక్తి లభించేందుకు, రోగాలు రాకుండా ఉండేందుకు అనేక పోషకాలు సహాయం చేస్తాయి. కనుక అన్ని పోషకాలను మనం తరచూ అందేలా చూసుకోవాలి. అయితే పోషకాలు అంటే చాలా మంది విటమిన్ ఎ, బి12, విటమిన్ డి, సి లాంటివి చెబుతారు. అంత వరకు బాగానే ఉన్నా ఇంకా అలాంటి పోషకాలు చాలానే ఉన్నాయన్న సంగతి అనేక మందికి తెలియదు. మన శరీరానికి కేవలం విటమిన్లు మాత్రమే కాదు, అనేక మినరల్స్ కూడా అవసరం అవుతాయి. కనుక మినరల్స్ కూడా లభించేలా చూసుకోవాలి. ఇక మినరల్స్‌లో క్యాల్షియం, ఐరన్, పొటాషియం వంటివి చెబుతారు. కానీ ఇవే కాకుండా మన శరీరానికి కావల్సిన మినరల్స్ లో ఇంకా అనేకం ఉన్నాయి. వాటిల్లో సెలీనియం కూడా ఒకటి. సెలీనియం కూడా మన శరీరంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అనేక జీవక్రియలకు ఇది అవసరం అవుతుంది.

### అనేక పనులు నిర్వహిస్తుంది..

మనకు నిత్యం అవసరం అయ్యే అనేక మినరల్స్‌లో సెలీనియం కూడా ఒకటి. దీని గురించి చాలా మందికి అవగాహన లేదు. అందువల్ల సెలీనియంను చాలా మంది తీసుకోరు. కానీ ఇది అనేక పనులను నిర్వహిస్తుంది. మన శరీరంలో అనేక జీవక్రియలకు సహాయం చేస్తుంది. మనల్ని ఆరోగ్యంగా ఉంచేందుకు తోడ్పడుతుంది. మన శరీర మెటబాలిజం పెరిగేందుకు సెలీనియం దోహదం చేస్తుంది. దీని వల్ల క్యాలరీలు ఖర్చువుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అలాగే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు వంటి అనారోగ్య సమస్యలు తగ్గుతాయి. సెలీనియం వల్ల థైరాయిడ్ పనితీరు మెరుగు పడుతుంది. థైరాయిడ్ ఉన్నవారికి సెలీనియం ఎంతో మేలు చేస్తుంది. అలాగే శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు సెలీనియం ఉండే ఆహారాలను తింటుంటే ఉపయోగం ఉంటుంది.


### యాంటీ ఆక్సిడెంట్ లాగే..

ఇక సెలీనియం మినరల్ అయినప్పటికీ ఇది యాంటీ ఆక్సిడెంట్‌లాగే పనిచేస్తుంది. రోజూ మన శరీరానికి తగినంత సెలీనియం లభించేలా చూసుకోవాలి. దీని వల్ల అనేక లాభాలను పొందవచ్చు. సెలీనియం యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక వైరస్ ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభించేలా చేస్తుంది. వైరస్ కారణంగా వచ్చే వ్యాధులు, జ్వరాలను తగ్గిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. వ్యాధులు రాకుండా చూస్తుంది. సెలీనియం తగినంతగా లభించకపోతే శరీరం తరచూ ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతుంది. కనుక మన శరీరానికి సెలీనియం లభించేలా చూసుకోవాలి. సెలీనియం మనకు రోజుకు 70 నుంచి 80 మైక్రోగ్రాముల మోతాదులో అవసరం అవుతుంది. ఇది మనకు అనేక ఆహారాల్లో లభిస్తుంది.

### సెలీనియం ఉండే ఆహారాలు..

సెలీనియం మనకు సముద్రపు ఆహారంలో అధికంగా లభిస్తుంది. పీతలు, చేపలు, రొయ్యలు వంటి ఆహారాలను తింటుంటే సెలీనియంను పొందవచ్చు. అలాగే బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా విత్తనాలు, అవిసె గింజలు వంటి నట్స్, సీడ్స్‌లోనూ ఇది ఉంటుంది. చికెన్, కోడిగుడ్లు, పాలకూర, పుట్ట గొడుగులు వంటి ఆహారాలను తింటున్నా కూడా సెలీనియంను పొందవచ్చు. వెల్లుల్లి, ఆవాలు, ఆలివ్ ఆయిల్, బ్రోకలీ, ఓట్స్, మటన్ లివర్, పైన్ నట్స్ వంటి ఆహారాలను తినడం వల్ల కూడా సెలీనియం లభిస్తుంది. ఇలా ఆయా ఆహారాలను తరచూ తింటుంటే సెలీనియం లభించేలా చూసుకోవచ్చు. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# పచ్చకామెర్లు ఉన్నవారు తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే.. వీటి వల్ల త్వరగా కోలుకుంటారు..!





పచ్చ కామెర్లు వచ్చిన వారి శరీరం పసుపు రంగులో కనిపిస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. కళ్లు కూడా పసుపు రంగులో దర్శనమిస్తుంటాయి. రక్తంలో బైలిరుబిన్ అనే సమ్మేళనం అధికంగా చేరడం వల్ల పచ్చ కామెర్లు వస్తాయి. ఇది పసుపు రంగులో ఉంటుంది కనుక శరీరం మొత్తం అదే రంగులోకి మారుతుంది. పచ్చ కామెర్లు వచ్చిన వారిని సులభంగా గుర్తించవచ్చు. ఈ క్రమంలోనే ఈ కామెర్లు ఉన్నవారు డాక్టర్లచే చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. వారు ఇచ్చే మందులను క్రమం తప్పకుండా వాడాలి. దీంతో కామెర్ల నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే ఆహారం విషయంలోనూ అనేక మార్పులు చేసుకోవాలి. పచ్చ కామెర్లు ఉన్నవారు పలు ఆహారాలను తీసుకోవడం వల్ల ఈ సమస్య నుంచి త్వరగా కోలుకుంటారు. శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. మళ్లీ చురుగ్గా పనిచేస్తారు. అలాగే శరీరానికి పోషకాలు కూడా లభిస్తాయి.

### నీళ్లను అధికంగా తాగాలి..

పచ్చ కామెర్లు ఉన్నవారి లివర్ పై తీవ్ర ఒత్తిడి పడుతుంది. కనుక లివర్‌పై భారం పెంచని ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాలను తినాలి. నూనె పదార్థాలు, కారం, మసాలాలు అధికంగా ఉండే ఆహారాలను తినకూడదు. తాజా పండ్లు, కూరగాయలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. పచ్చ కామెర్లు ఉన్నవారు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను తింటుంటే ఎంతగానో మేలు జరుగుతుంది. ఈ వ్యాధి బారిన పడిన వారు శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవాలి. అందుకు గాను నీళ్లను అధికంగా తాగాల్సి ఉంటుంది. దీంతో ఆహారం కూడా సులభంగా జీర్ణం అవుతుంది. లివర్‌పై పడే భారం తగ్గుతుంది. శరీరంలోని వ్యర్థాలను లివర్ సులభంగా బయటకు పంపిస్తుంది. లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. దీంతో వ్యాధి నుంచి సులభంగా కోలుకుంటారు. ఈ క్రమంలో పచ్చ కామెర్లు ఉన్నవారు రోజుకు కనీసం 2 నుంచి 3 లీటర్ల వరకు నీళ్లను తప్పనిసరిగా తాగాల్సి ఉంటుంది.

### యాంటీ ఆక్సిడెంట్లు ఉండే ఆహారాలు..

పచ్చ కామెర్లు ఉన్నవారు తాజా పండ్లు, కూరగాయాలను తింటుండాలి. వీటిని పోషకాలకు గనిగా చెబుతారు. వీటిని తినడం వల్ల నీరసం, అలసట తగ్గుతాయి. ఉత్సాహంగా మారుతారు. యాక్టివ్‌గా ఉంటారు. వ్యాధి నుంచి త్వరగా కోలుకుంటారు. ముఖ్యంగా యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలను తినడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. అన్ని రకాల పండ్లు, కూరగాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగానే ఉంటాయి. అయితే ద్రాక్ష, నారింజ, కివి, పైనాపిల్, యాపిల్, దానిమ్మ, నిమ్మ వంటి పండ్లతోపాటు టమటాలు, చిలగడదుంపలు, క్యారెట్లు, పాలకూర, బీట్ రూట్ వంటి కూరగాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కనుక వీటిని రోజూ తింటుంటే పచ్చ కామెర్లు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఆ వ్యాధి నుంచి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.

### ఎంజైమ్‌లు ఉండే ఆహారాలు కూడా..

పచ్చ కామెర్లు ఉన్నవారు పలు ఎంజైమ్‌లు కలిగిన ఆహారాలను తీసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ముఖ్యంగా జీర్ణాశయానికి అవసరం అయ్యే ఎంజైమ్‌లు కలిగిన తేనె, పైనాపిల్, బొప్పాయి, మామిడి వంటి ఆహారాలను, పండ్లను తింటుంటే ఫలితం ఉంటుంది. వీటిని తినడం వల్ల జీర్ణాశయానికి కావల్సిన ఎంజైమ్‌లు లభిస్తాయి. ఇవి జీర్ణక్రియ సాఫీగా జరిగేలా చేస్తాయి. దీంతో జీర్ణ సమస్యలు తగ్గి జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. దీని వల్ల పచ్చ కామెర్లు త్వరగా తగ్గుతాయి. అలాగే ఈ వ్యాధి ఉన్నవారు రోజూ ఓట్స్, వాల్ నట్స్‌ను తింటున్నా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. పచ్చ కామెర్లు ఉన్నవారు కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా వేపుళ్లను అసలు తినకూడదు. నూనె పదార్థాలు, ప్రాసెస్ చేయబడిన ఆహారాలు, మసాలాలు, కారం ఉండే ఆహారాలు, తీపి పదార్థాలను అసలు తినకూడదు. వీటిని తింటే లివర్‌పై భారం పడుతుంది. దీంతో లివర్‌లో కొవ్వు చేరి పచ్చ కామెర్లు మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది. కనుక ఈ వ్యాధి ఉన్నవారు ఆహారం విషయంలో జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. దీని వల్ల వ్యాధి నుంచి త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉండవచ్చు.

# భూమిని తాకే సూర్యరశ్మి తగ్గుతోంది!

## లండన్ అధ్యయనం హెచ్చరిక!

మానవాళి సాంకేతిక ప్రగతికి ప్రాధాన్యతను సూచికలుగా భావిస్తున్న ఉపగ్రహాలు, రాకెట్ ప్రయోగాలు.. ఇప్పుడు భూమి చుట్టూ ఉన్న పర్యావరణానికి కొత్త శాపంగా మారుతున్నాయి. నిరంతరాయంగా సాగుతున్న అంతరిక్ష ప్రయోగాలు ఎగువ వాతావరణాన్ని తీవ్రంగా కలుషితం చేస్తున్నాయని, దీనివల్ల భూమికి చేరే సూర్యరశ్మి పరిమాణం క్రమంగా తగ్గుతోందని బ్రిటన్‌కు చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ లండన్'(యూసీఎల్) పరిశోధకుల అధ్యయనంలో విల్లడైంది. ప్రఖ్యాత అంతర్జాతీయ జర్నల్ 'ఎర్త్ ఫ్యూచర్'లో మే 14న ప్రచురితమైన 'రేడియేటివ్ ఫోర్సింగ్ అండ్ ఓజోన్ డిప్లిషన్ ఆఫ్ ఎ డికేడ్ ఆఫ్ శాటిలైట్ మెగాకాన్స్టెలేషన్ మిషన్స్' అనే పరిశోధనా



### నియంత్రణ లేని జియో ఇంజినీరింగ్ ప్రయోగం!

యూనివర్సిటీ కాలేజ్ లండన్‌కు చెందిన శాస్త్రవేత్తలు కానర్ ఆర్.బార్కర్, ప్రొఫెసర్ ఎలోయిస్ ఎ.మరైస్, ఎరిక్ వై నేతృత్వంలోని బృందం 2020 నుంచి 2022 మధ్య కాలంలో జరిగిన రాకెట్ ప్రయోగాలు, అంతరిక్షంలో కాలం చెల్లిన ఉపగ్రహాల అవశేషాలపై సమగ్ర పరిశోధన చేసింది. 'రాకెట్ ప్రయోగాలు వాతావరణ కాలుష్యానికి ఒక ప్రత్యేకమైన మూలంగా మారాయి. ఇవి హానికరమైన రసాయనాలను నేరుగా ఎగువ వాతావరణ పొరల్లోకి విడుదల చేస్తున్నాయి. తద్వారా భూమిపై ఇప్పటివరకు అత్యంత స్వచ్ఛంగా భావించిన సహజ వాతావరణం కలుషితమవుతోంది' అని యూసీఎల్ ప్రధాన పరిశోధకుడు కానర్ బార్కర్ తెలిపారు. గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడానికి శాస్త్రవేత్తలు ప్రతిపాదించే కృత్రిమ 'జియో ఇంజినీరింగ్' పద్ధతుల తరహాలోనే.. ఈ ఉపగ్రహ ప్రయోగాల వల్ల విడుదలవుతున్న కాలుష్యం భూమిని తాకే సూర్యరశ్మిని అడ్డుకుంటోందని పరిశోధకులు తేల్చారు. ఇది భూమిపై స్వల్ప శీతలీకరణ ప్రభావాన్ని చూపినప్పటికీ పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతలతో పోలిస్తే ఇది చాలా తక్కువని, అయితే దీనివల్ల భవిష్యత్తులో ఊహించని తీవ్ర పర్యావరణ పరిణామాలు ఎదురవుతాయని ప్రాజెక్ట్ లీడ్ ప్రొఫెసర్ ఎలోయిస్ మరైస్ హెచ్చరించారు. పరిస్థితి చేతులు దాటిపోకముందే దేశాధినేతలు చర్యలు చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు.

### ఐదేళ్లలోనే మూడింతలైన ప్రయోగాలు

**రాకెట్ ప్రయోగాల్లో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను ఈ నివేదిక గణాంకాలతో సహా విశ్లేషించింది.**

| సంవత్సరం | వార్షిక రాకెట్ ప్రయోగాల సంఖ్య |
|---|---|
| 2020 | 114 |
| 2025 | 329 |

ఈ భారీ వృద్ధికి ప్రధాన కారణం అమెరికాకు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ నిర్వహిస్తున్న స్టార్‌లింక్ మెగాకాన్స్టెలేషన్ ప్రాజెక్టేనని నివేదిక స్పష్టం చేసింది. ఇంటర్నెట్ సేవల కోసం స్పేస్ ఎక్స్ ఇప్పటివరకు కక్ష్యలోకి సుమారు 12,000 ఉపగ్రహాలను ప్రవేశపెట్టింది. ఈ దశాబ్దం ముగిసేనాటికి అంతరిక్షంలోకి మరో 65,000 ఉపగ్రహాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినప్పటికీ, ప్రస్తుత వేగాన్ని చూస్తుంటే ఆ సంఖ్య అంతకంటే ఎక్కువే ఉండేలా కనిపిస్తోంది.



### ఎగువ వాతావరణంలో తిష్ఠ వేస్తున్న మసి

స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన ఫాల్కన్ 9 వంటి రాకెట్లు కిరోసిన్ ఆధారిత ఇంధనాన్ని ఉపయోగిస్తాయి. ఇవి మండటం వల్ల భారీ ఎత్తున 'నల్ల కార్బన్' లేదా 'మసి' కణాలు వాతావరణంలోకి విడుదలవుతాయి. భూమిపై అయితే వర్షాల వల్ల ఈ మసి కడిగివేయబడుతుంది, కానీ ఎగువ వాతావరణంలో గాలి ప్రసరణ చాలా నెమ్మదిగా ఉండటం వల్ల ఈ హానికరమైన మసి కణాలు అక్కడే దశాబ్దాల పాటు తిష్ఠ వేస్తున్నాయి.

### ప్రమాద ఘంటికలు

2029 నాటికి అంతరిక్ష పరిశ్రమ ద్వారా ఏటా దాదాపు 870 టన్నుల మసి వాతావరణంలోకి విడుదలయ్యే ప్రమాదం ఉంది. ఈ ప్రయోగాల వల్ల క్లోరిన్ వంటి రసాయనాలు కూడా విడుదలవుతున్నాయి. అయితే ప్రస్తుతానికి కిరోసిన్ ఇంధన రాకెట్ల వల్ల విడుదలయ్యే క్లోరిన్ పరిమాణం తక్కువగా ఉండటం వల్ల ఓజోన్ పొరపై దీని ప్రభావం స్వల్పంగానే ఉంది. కానీ, భవిష్యత్తులో ప్రయోగాలు పెరిగితే ముప్పు తప్పదు.

### మున్ముందు మరింత పోటీ!

ప్రస్తుతం అంతరిక్ష రంగంలో వాణిజ్య పోటీ విపరీతంగా పెరుగుతోంది. కేవలం స్పేస్ ఎక్సే కాకుండా అమెజాన్ సైతం తన సొంత ఇంటర్నెట్ ఉపగ్రహ నెట్‌వర్క్ 'లియో'ను అభివృద్ధి చేసే పనిలో పడింది. అటు చైనా కూడా 'గువాంగ్' పేరుతో భారీ ఉపగ్రహ సమూహాన్ని నిర్మించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో వేలాది ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపడానికి మరిన్ని వందల రాకెట్ ప్రయోగాలు అవసరమవుతాయి. అంతరిక్ష సాంకేతికత వైపు ప్రపంచ దేశాలు అడుగులు వేస్తున్న తరుణంలో.. పర్యావరణ సమతుల్యతను కాపాడుకునేలా కఠిన నిబంధనలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఈ అధ్యయనం నొక్కి చెప్పింది.

